J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 40 6.3.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



• నెయ్యి తీసిన గొయ్యి

# మతి తప్పిన మాటలు దేవదేవుడితో ఆటలు

- ఏడుకొండలు వేదికగా కుళ్ళు రాజకీయాలు
- లడ్డూ వ్యవహారంలో శృతిమించుతున్న నేతల వ్యాఖ్యలు
- జంతువుల కొవ్వు అని చెప్పి అభాసుపాలైన కూటమి
- కల్తీ అయ్యిందని తెలిసినా వైఎస్సార్‌సీపీ బుకాయింపు
- తీవ్రంగా దెబ్బతింటున్న హిందువుల మనోభావాలు

***'తిరుమల' సాక్షాత్తూ కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరుడు కొలువైన దివ్యక్షేత్రం. యావత్ హిందూ ప్రపంచానికి భూలోక వైకుంఠం. ఇంతటి మహత్తు కలిగిన ఏడుకొండలు ప్రస్తుతం, నీచాతినీచమైన రాజకీయాలకు వేదికవుతున్నాయి. కొందరు పరమ పవిత్రమైన శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని మాట్లాడుతుంటే, మరికొందరు కాదుకాదు కేవలం పామాయిల్, రసాయనాలు మాత్రమే అని సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకొందరు కొండపై రాజకీయాలు మాట్లాడకూడదంటూనే అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. వ్యభిచారం, అక్రమ సంబంధాలు, దోపిడీ, మద్యం, మాంసం ఇలా ఒకటేమిటి, నోటితో పలకలేని, పెన్నుతో రాయలేని భాషతో నిస్సిగ్గుగా దేవుడి చెంతనే చండాలానికి పాల్పడుతున్నారు. ఫలితంగా కోట్లాది హిందువుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతినడమే కాకుండా, పరమ పవిత్రమైన తిరుమలకు ఇదేం దుస్థితి అంటూ మౌనంగా రోదించే పరిస్థితి దాపురించింది.***

రోజూ సగటున లక్షమంది దర్శించుకునే పుణ్య క్షేత్రం, సెలయేళ్లు, ప్రకృతి రమణీయతతో అలరారే ప్రాంతం, ఋషులు, దేవతలు, వన్యప్రాణులు, పచ్చదనం కలగలిసిన మహాశక్తివంతమైన ప్రదేశం తిరుమల. స్వచ్ఛతకి, పవిత్రతకి మచ్చుతునకగా చెప్పుకునే పుణ్యస్థలం మన వెంకన్న కొలువైన మహాక్షేత్రం. ఇక్కడి ఏడుకొండలు, యావత్ హిందూ జాతి కీర్తికి ప్రతీకలు. ఇక్కడ కొలువైన శ్రీవారు ప్రపంచంలోని హిందువులందరికీ పరమ పూజ్యులు. ఆయన కరుణా కటాక్షాల కోసం కోట్లాదిగా ప్రజలు హరినామ స్మరణతో తిరుమల క్షేత్రాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఇంతటి మహత్తు కలిగిన దైవ సన్నిధిలో ప్రస్తుతం మహాపచారం, మహా ఘోరం, మహా పాపం అన్నట్లుగా పరిస్థితులు తయారయ్యాయంటే అతిశయోక్తి కాదేమో. సామాన్య ప్రజలు ఎంతో భక్తిప్రపత్తులతో శ్రీహరిని శరణు కోరుతూ స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందుతారు. ఇక ఇక్కడి లడ్డూ ప్రసాదం ప్రాశస్త్యమైతే వర్ణించనలవికాదు. స్వామివారిని స్వయంగా దర్శించుకునే అవకాశం లేని ఎంతోమంది, కేవలం లడ్డూ ప్రసాదాన్ని స్వీకరించి, సాక్షాత్తూ శ్రీవారి పాదాలను తాకినంతగా మురిసిపోతారు. ఒక్కమాటలో చెప్పాలంటే కొండ లడ్డంటే హిందూ ప్రజలకు కోహినూర్ వజ్రం కంటే ఎక్కువ. అలాంటి మహా ప్రసాదం మైలపడిందని అందులో పందికొవ్వు, గొడ్డు కొవ్వు, చేపనూనె కలిసిందని రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు హిందువుల గుండెల్ని పిండేస్తున్నాయి. నిజంగా కల్తీ జరిగితే ఎందుకు ఉపేక్షిస్తున్నారు..? ఇంతటి మహా పాపానికి ఒడికట్టిన వారికి తగిన శాస్తి చేయకుండా ఎందుకు మాటలకే పరిమితం అవుతున్నారు..? కాసుల కక్కుర్తితో ఏ పామాయిలో, నూనెలాంటి పదార్థామో కలిపి నెయ్యిని కల్తీ చేసుంటే వాటిని సాక్ష్యాలతో బయటపెట్టి అందుకు బాధ్యులైన వారి తాటతీయాలి. అంతేకానీ దానిని స్వార్థం కోసం వాడుకుంటూ, రోజుల తరబడి, వారాల తరబడి, నెలల తరబడి ఎందుకు రాజకీయం చేస్తున్నారు?

2లో



# దేవదేవుడితో ఆటలు

(మొదటిపేజీ తరువాయి)

పందికొవ్వు, గొడ్డుకొవ్వంటూ ఇంగితం లేకుండా ఎందుకు మాట్లాడుతున్నారు..? అని సగటు హిందువు ఆత్మక్షోభతో అల్లాడి పోతున్నాడు. ఈ బాధను ఈ ఆవేదనను పట్టించుకోని మన నేతలు మాత్రం ఇంకా.. ఇంకా దిగజారుతూ పార్టీల మాటున పాపిష్టి పనులకు వత్తాసు పలుకుతూ దేవదేవుడికి తీరని ద్రోహం తలపెడుతూ మహాపాపాన్ని మూటకట్టుకుంటున్నారు.

## ఏడాదిన్నరగా తప్పులు.. తప్పటడుగులు!

కూటమి అధికారంలోకి వచ్చిన మూడు నెలల తరువాత 2024 సెప్టెంబర్ 18న సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడే స్వయంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూలో ఉపయోగించిన నెయ్యిలో కల్తీ జరిగిందని ఆరోపించారు. అంతేకాక ఆ నెయ్యిలో ఏకంగా పందికొవ్వు, గొడ్డు కొవ్వు కలిసిందని వ్యాఖ్యానించడం సంచలనంగా మారింది. ఈ అంశంలో బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు సీనియర్ ఐపీఎస్ అధికారి సర్వశ్రేష్ట త్రిపాఠి నేతృత్వంలో సిట్ వేస్తున్నట్లు ప్రకటించారు. అయితే తన రాజకీయ స్వార్థం కోసం, వైఎస్సార్‌సీపీ మీద కోపంతో చంద్రబాబు శ్రీవారి లడ్డూపై అపవాదులు వేస్తున్నారని,రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారంటూ కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిని విచారించిన అత్యున్నత న్యాయస్థానం ఇద్దరు సీబీఐ అధికారులు, ఇద్దరు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన ఓ నిపుణుడితో ప్రత్యేక దర్యాప్తు బృందం(మరో సిట్)ను ఏర్పాటు చేసింది. ఈ కమిటీ నివేదిక వచ్చేవరకు శ్రీవారి లడ్డూ విషయంలో రాజకీయ విమర్శలు చేయకూడదని, శ్రీవారి లడ్డూకు ఎవరూ కళంకం ఆపాదించకుండా ఉండాలని స్పష్టం చేసింది. అయితే ఈ విషయాన్ని పట్టించుకోకుండా కూటమి నాయకులు లడ్డూపై విమర్శలు చేస్తూనే ఉండడం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఏకంగా ప్రాయశ్చిత్త దీక్ష పేరుతో విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆలయంలో మెట్లు శుద్ధిచేయడం కూడా అప్పట్లో చర్చనీయాశంగా మారింది.

## కల్తీకి.. కళంకానికి తేడా తెలుసుకోకుండా!

శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీనెయ్యి వినియోగంపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి 14 నెలల పాటు 12 రాష్ట్రాల్లో సీబీఐ ఆధ్వర్యంలోని సిట్ దర్యాప్తు చేపట్టింది. ఈ ఏడాది జనవరి 23న నెల్లూరు ఏసీబీ కోర్టులో తన తుది చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఇందులో తిరుమల శ్రీవారి లడ్డూలో పందికొవ్వు, గొడ్డుకొవ్వు, చేపనూనె ఉన్నట్లు ఎక్కడా పేర్కొనలేదు. అదే సమయంలో పామాయిల్, పామాయిల్ కెర్నల్ ఆయిల్, కొబ్బరి నూనె మిశ్రమం, బీటా కెరోటిన్ (రంగు కోసం) వంటి రసాయనాలను లడ్డూ తయారీకి వాడే నెయ్యిలో వినియోగించారని స్పష్టం చేసింది. తద్వారా కృత్రిమ రుచులతో లడ్డూలు తయారు చేశారని, ఈ విషయంలో అప్పటి టీటీడీ కార్యనిర్వహణ అధ్యక్షులు(ఈవోలు)గా పనిచేసిన అనిల్ కుమార్ సింఘాల్, ధర్మారెడ్డిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ సిఫార్సు చేసింది. అయితే, ఈ విషయాన్ని మరింత సమగ్రంగా పరిశీలించి, సిట్ ఇచ్చిన నివేదిక సారాంశాన్ని 45 రోజుల వ్యవధిలో క్లుప్తంగా అందరికీ అర్థమయ్యే రీతిలో తెలియజేయాలంటూ ఏకసభ్య కమిషన్‌ను చంద్రబాబు ప్రభుత్వం ఇటీవల నియమించింది. అయితే, ఆ నివేదిక వచ్చేవరకు కూడా ఆగకుండా శ్రీవారి లడ్డూలో పందికొవ్వు, గొడ్డుకొవ్వు, చేపనూనె కలిసిందంటూ కూటమి పెద్దలు, నాయకులు రాజకీయపరమైన వ్యాఖ్యలు చేయడం, ప్రతిపక్షాలను టార్గెట్ చేసే క్రమంలో శ్రీవారిని, తిరుమల కొండను, తిరుమల లడ్డూ ప్రసాదాన్ని వాడుకోవడం ఏమాత్రం సహేతుకం కాదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా తనకు శ్రీవారే పునర్జన్మ ప్రసాదించారని, అలిపిరి బాంబ్‌బ్లాస్ట్ నుంచి కాపాడారని చెప్పుకునే చంద్రబాబు తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందంటూ తరచూ మాట్లాడడం ఆయన స్థాయికి తగదని హితబోధ చేస్తున్నారు. తొందరపడి ఒక కోయిల ముందే కూసిందన్నట్లుగా నిజానిజాలు నిర్ధారించుకోకుండా ఎదుటిపక్షంపై నిందలు వేసే క్రమంలో నోరుజారడం దాన్ని కప్పిపుచ్చుకునేందుకు నానా విధాలుగా ప్రయత్నించడం కూటమి ప్రభుత్వాన్ని అబాసుపాలు చేస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

2019–24 కాలంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తిరుమలలో ఎన్నో అపచారాలు జరిగాయని, లడ్డూలో కల్తీ కూడా అందులో ఒకటని ఎక్కువ మంది విశ్వసిస్తున్నా, ఏకంగా పందికొవ్వు, గొడ్డు కొవ్వు కలిపారనడాన్ని మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు. కొండపై తప్పు జరిగితే బట్టబయలు చేయడంలో తప్పులేదని, కానీ మొత్తం హిందూ ధర్మానికే మచ్చతెచ్చేలా తిరుమల పవిత్రతకే కళంకం తెచ్చేలా వ్యవహరించడం మాత్రం ఆమోదయోగ్యం కాదని ఈ విషయంలో కూటమి పెద్దలు ఆత్మవిమర్శ చేసుకోవడం ఉత్తమం అని తేల్చిచెబుతున్నారు. కూటమిలో భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలోని చాలమంది సీనియర్, కిందిస్థాయి నాయకులు కూడా అంతర్గతంగా ఇదే విషయాన్ని చర్చించుకున్నట్లు తెలిసింది.

## చేసిందంతా చేసి.. చిన్నతప్పా?

ఇక వైసీపీ విషయాని కొస్తే అప్పటి ప్రభుత్వ హయాంలో కొండపై లెక్కకుమిక్కిలి తప్పులు జరిగాయనడంలో సందేహం లేదు. ముఖ్యంగా ఆమ్యామ్యాల కోసం లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో అధికారులు, పాలకమండలి పెద్దలు కలిసి తప్పిదాలకు పాల్పడినట్లు సుప్రీంకోర్టు వేసిన సిట్(ప్రత్యేక దర్యాప్తు బృందం) తన చార్జిషీట్‌లో స్పష్టం చేసింది. 2019–24 మధ్య లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యిలో కల్తీ జరిగిన మాట వాస్తవం అని తేల్చిచెప్పింది. రసాయనాలతో లడ్డూలు తయారు చేసి ఘోర తప్పిదానికి పాల్పడినట్లు ఆరోపించింది. దాదాపు 60లక్షల కిలోల కల్తీనెయ్యితో 2 కోట్ల లడ్డూలను తయారు చేసిందని తద్వారా ఐదేళ్లలో 235 కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడిందని ఎండగట్టింది. అయితే జంతువుల కొవ్వు ఎక్కడా లేదని మాత్రం సిట్ చెప్పిందని, చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ వంటి కూటమి నాయకులే తమపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పెద్దలు, నాయకులు బుకాయించడం విమర్శలకు దారితీస్తోంది. తమ హయాంలో జరిగిన తప్పును తప్పుగా ఒప్పుకోకుండానే కూటమి పెద్దలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేయడం వైఎస్సార్‌సీపీ నాయకులకే చెల్లింది. పైగా పరకామణి దొంగతనాన్ని చిన్న తప్పుగా జగన్ మోహన్ రెడ్డే కొట్టిపారేయడం తీవ్ర విమర్శలకి దారితీసింది. అయితే, వైసీపీ పాలనలో టీటీడీ పాలనా వ్యవహారాలలో ఛైర్మన్ వై.వీ.సుబ్బారెడ్డిని సైతం పక్కన పెట్టి ఇంచార్జ్ ఈఓగా పనిచేసిన ధర్మారెడ్డి అన్ని విషయాలలో చక్రం తిప్పాడన్నది జగ(నె)మెరిగిన సత్యం. నెయ్యి కల్తీ వ్యవహారంలో కర్త, కర్మ, క్రియ అన్నీ ధర్మారెడ్డే అని కూడా వైసీపీ అధినాయకత్వానికి తెలుసు. కానీ, వాళ్ళు మాత్రం దొంగకి తేలు కుట్టినట్లుగా వున్నారు. అలా ఉండడం సబబు కాదని కూడా వైసీపీలోని కొంతమంది అంతర్గతంగా చర్చించుకోవడం ఇక్కడ గమనార్హం.

## వివాదాలలో ప్రస్తుత ఛైర్మెన్!

ఇక ఇలాంటి పరిస్థితుల్లోనే ప్రస్తుత టీటీడీ పాలక మండలి ఛైర్మెన్‌గా ఉన్న బీఆర్ నాయుడిపై లైంగిక వేధింపులు, అక్రమ సంబంధాల ఆరోపణలు రావడం సంచలనం కలిగిస్తోంది. ఈ వ్యవహారం తిరుమల తిరుపతి దేవస్థానం రాజకీయాలకి వేదికగా మారిపోయేందుకు మరింతగా కారణమైంది. గతంలో ఎస్వీబీసీ ఛైర్మన్‌గా ఉన్న పృథ్వీ 30 ఇయర్స్ ఇండస్ట్రీ అంటూ కొండపై లైంగిక వేధింపులకు పాల్పడితే ప్రస్తుతం 30 ఏళ్ల పరిచయం అంటూ బీఆర్ నాయుడు అక్రమ సంబంధాలకు తెరతీశారని సగటు హిందువు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా అధికార, ప్రతిపక్ష పార్టీల పెద్దలు తిరుమల తిరుపతి దేవస్థానం విషయంలో ఆచితూచి వ్యవహరించకుండా.. దిగజారి రాజకీయాలు చేస్తూ, శ్రీవారి కొండ ప్రాశస్త్యాన్ని తగ్గించడమే కాకుండా అడ్డమైన వారికి అర్హతలేని వారికి మదాహంకారంతో వ్యవహరిస్తున్న వారికి టీటీడీ పాలకమండలిలో చోటు కల్పిస్తుండడం మహాపాపం అని భక్తులు గగ్గోలు పెడుతున్నారు. పైగా బీఆర్ నాయుడు వంటి వారు ప్రెస్‌మీట్‌లు పెట్టి మరీ తగ్గేదేలే అన్నట్లు మాట్లాడడం దిగజారుతున్న రాజకీయ, ఆధ్యాత్మిక విలువలకు సంకేతం అనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా, మన నాయకులు దేవుడు పేరుతో రాజకీయాలు చేయడం దేవుడితో ఆటలాడడం దేవుడి ప్రసాదాన్ని కించపరుస్తూ మాట్లాడడం కోట్లాది హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బ తీస్తోందన్నది మాత్రం కాదనేలేని నిజం. చట్ట సభలలో సైతం ప్రజా సమస్యలకి, సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి తిలోదకాలిచ్చి, తిరుమల లడ్డు అంశానికే ప్రాధాన్యతనిచ్చి పదే పదే చర్చించడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, నాయకులు నోరు అదుపులో పెట్టుకుని తిరుమల శ్రీవారిని రాజకీయాలకు దూరంగా ఉంచాల్సిన అవసరం ఉందని, లేదంటే ఆ దేవదేవుడే వారికి తగిన శాస్తి చేస్తాడని కోట్లాదిమంది హిందువులు సామాజిక మాధ్యమాలలో నినదిస్తున్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తూ ఆధ్యాత్మిక సెంటిమెంట్లని అడ్డంపెట్టుకుని రాజకీయ క్రీనీడలు సాగించడం ఎవరికీ సబబు కాదని ఇటు అధికారపక్షాన్ని, అటు ప్రతిపక్షాన్ని హెచ్చరిస్తున్నారు. “ధర్మో రక్షతి రక్షితః”..!


**FORM IV**
(See Rule 8)

Statement about Ownership and other Particulars about News Paper, **Lawyer (Weekly)**

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 2. Periodicity of its Publication | : | Weekly |
| 3. Printer's Name | : | Tunga SivaPrabhat |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 4. Publisher's Name | : | Tunga SivaPrabhat |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 5. Editor's Name | : | Tunga SivaPrabhat |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 6. Name and Address of individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total Capital | : | Tunga SivaPrabhat |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |

I, Thunga Siva Prabhath Reddy hereby declare that the particulars given above are true to the best of my Knowledge and belief.

(Sd)

01.03.2026 SIVA PRABHAT.T


# రొయ్యలగుంటల్లో నీళ్ళు..పొలాల్లోకి!

## • వరిచేలు దెబ్బతింటున్నాయంటూ రైతుల లబోదిబో

జిల్లాలో రొయ్యలసాగు జోరుగా సాగుతున్న నేపథ్యంలో, రొయ్యలగుంటల్లోంచి బయటిక వదిలేసే నీళ్ళన్నీ తమ పొలాల్లోకి వచ్చి పంటలు దెబ్బతింటున్నాయని పలు ప్రాంతాల రైతులు లబోదిబోమంటున్నారు. పచ్చని పంటలు పండే భూముల్లో కొంతమంది రైతులు, అంతకన్నా లాభసాటిగా ఉంటుందని ఆ చేలన్నిటినీ రొయ్యలగుంటలుగా మార్చేసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే, వాటిలోంచి వచ్చే వృధా నీటిని పక్కనే ఉన్న పొలాల్లోకి వదిలేస్తున్నారు. వీటికి ప్రత్యామ్నాయం ఉండడం లేదు. సంబంధిత అధికారులు వాటిని సందర్శించి, పొలాలు దెబ్బతినకుండా చేయాల్సిన ఏర్పాట్లను సూచిస్తుంటే.. ఇప్పుడు ఈ ఇబ్బందులు ఉండేవి కాదు. ఈ నేపథ్యంలో మనుబోలు మండలంలోని మనుబోలు, పిడూరు గ్రామాల రైతులు తాము వేసుకున్న వరి పొలాలు దెబ్బతింటున్నాయి మహాప్రభో అంటూ జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తే, కలెక్టర్ ఆదేశాలపై మత్స్యశాఖ వారు ఇటీవల ఆయా ప్రాంతాలను పరిశీలించారు.

### అనధికారికంగా రొయ్యల సాగు :

జిల్లాలో అనధికారికంగా రొయ్యలసాగు(ఆక్వా సాగు) పెద్ద ఎత్తున జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లాలో 16, 646 ఎకరాల్లో చేపల గుంటలు, 25, 554 ఎకరాల్లో రొయ్యల గుంటలు ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. జిల్లామొత్తమ్మీద కనీసం 42 వేల ఎకరాలకి పైగానే రొయ్యలసాగు జరుగుతుంటే, అందులో 33వేల ఎకరాల దాకా రిజిస్టర్ అయింది. కానీ, మిగిలినవి నేటికీ రిజిస్ట్రేషన్ చేసుకోలేదని వెల్లడైంది. ఒక్క మనుబోలు మండలం లోని సుమారు 4వందల ఎకరాలకి పైగానే అనధికారికంగా రొయ్యలసాగు జరుగుతోందని అధికారుల పరిశీలనలో తేలింది. ఎలాంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా ఎవరిష్టాను సారం వారు రొయ్యలగుంటలు, చేపలగుంటల వేసేసు కుంటుండడంతో రకరకాల సమస్యలు వస్తున్నాయి. రొయ్యలగుంటల సమీపంలోనే ఉన్న వరిపొలాల్లోకి ఆ నీరంతా వెళ్ళి పంటలను దెబ్బతీస్తున్నాయి.

### కోళ్ళ వ్యర్థాల వినియోగంపై నిషేధం :

రొయ్యలగుంటలు, చేపలగుంటల్లో కోళ్ళ వ్యర్థా లను వేయడంపై నిషేధం ఉందని, వ్యర్థాలను రొయ్యలగుంటల్లో వేయడం వల్ల నీటి కాలుష్యం పెరగడంతో పాటు, హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌లు పెరుగుతాయని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ డి.శాంతి తెలిపారు. అదేవిధంగా, నమోదు చేసుకోకుండా ఆక్వా సాగు చెయ్యడం నేరమని, ఆ నిబంధనలు పాటించకుంటే ఆక్వాసాగును జప్తు చేయడం, జరిమానాలు విధించడం, విద్యుత్ సరఫరా నిలిపివేయడం వంటి చట్టపరమైన చర్యలుంటాయని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.




కీ॥శే॥ బెజవాడ దశరథరామిరెడ్డి - అన్నపూర్ణమ్మల మనుమడు, బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి - ప్రత్యూషల కుమారుడు **శ్రేయంత్ - సాయి నిఖిత** (నెల్లూరుజిల్లా చెన్నరాయునిపాళెం వాస్తవ్యులు, హైదరాబాదు నివాసి విడవలూరు కృష్ణమోహన్‌రెడ్డి - ప్రవీణల కుమార్తె)ల వివాహం ఫిబ్రవరి 25వ తేదీ హైదరాబాదులో, రిసెప్షన్ మార్చి 1న నెల్లూరులో ఘనంగా జరిగాయి. కొత్త జంటకి 'లాయర్' శుభాశీస్సులు.






ప్రముఖ వైద్యులు, విజయ నర్సింగ్ హోం అధినేత డాక్టర్ ఎస్.వి.కృష్ణారెడ్డి - విజయలక్ష్మిల కుమారుడు **ప్రీతమ్‌రెడ్డి - హర్షల** (హైదరాబాదు వాస్తవ్యులు గాజులపల్లి విజయకుమార్‌రెడ్డి - శోభారాణిల కుమార్తె)ల పరిణయం ఫిబ్రవరి 22వ తేదీ హైదరాబాదులో, రిసెప్షన్ ఫిబ్రవరి 27న నెల్లూరులో వైభవంగా జరిగాయి. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.

# అంగరంగ వైభవం.. రంగనాథుడి రథోత్సవం



నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 5వతేదీ గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా జరిగిన రథోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో రంగనాయకులపేట భక్తజనసంద్రంగా మారింది. ఆలయ అర్చకులు తొలుత.. స్వామివారిని, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి, విశేష పూజలు చేసిన అనంతరం రథంపై వేంచేపు చేశారు. పూల అలంకారాలు, స్వర్ణాభరణాలతో సర్వాలంకారశోభితుడై శ్రీరంగనాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులంతా జై రంగా!..శ్రీ రంగా' అంటూ నామోచ్ఛరణలు చేస్తూ, అడుగడుగునా కొబ్బరికాయలు సమర్పించి, కర్పూర హారతులిచ్చారు. సంతపేటలోని నాలుగుకాళ్ళ మండపం వద్ద వేదగిరి లక్ష్మీనృసింహస్వామి ఎదురుకోలు ఉత్సవం రథోత్సవంలో ప్రత్యేకంగా ఉండి భక్తులను ఆకట్టుకుంది. రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ నేతృత్వంలో ఆలయ నిర్వాహకులు, దేవాదాయశాఖ వారు, జిల్లా అధికారులు రథోత్సవంలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. మంత్రి నారాయణ సతీమణి రమాదేవి రథోత్సవంలో పాల్గొని శ్రీ రంగనాథస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని స్వామిని వేడుకున్నట్లు ఆమె తెలిపారు. రథోత్సవంలో ఎలాంటి అవాంతరాలు జరుగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసింది.

# నెల్లూరుకి..ఔటర్ రింగ్‌రోడ్డు అవసరం

## శాసనమండలి సమావేశంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



ఇటీవలికాలంలో బాగా విస్తరిస్తున్న నెల్లూరు నగరానికి ఔటర్ రింగ్‌రోడ్డు అవసరమని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అమరావతిలో ఇటీవల జరిగిన శాసనమండలి సమావేశాల్లో ఆయన నెల్లూరు నగరానికి ఔటర్ రింగ్ రోడ్డు ఆవశ్యకతను గురించి మాట్లాడారు. నెల్లూరు నగరం 8 లక్షల మంది జనాభాతో, 150చ.కి.మీ విస్తీర్ణంతో ఆంధ్రప్రదేశ్‌లో నాలుగవ అతిపెద్ద నగరపాలక సంస్థగా అభివృద్ధి చెందుతోందన్నారు. ముఖ్యంగా కృష్ణపట్నం పోర్టు అభివృద్ధి, పారిశ్రామిక విస్తరణ, జాతీయ రహదారి రాకపోకల పెరుగుదలతో నగరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందన్నారు. 2007లో నిర్మించిన ప్రస్తుత బైపాస్ రహదారి అప్పట్లో నగరానికి వెలుపల ఉండగా, ఇప్పుడు నగర విస్తరణ కారణంగా అది నగర మధ్యభాగంలోకి వచ్చినట్లైందని తెలిపారు. బైపాస్‌కు ఇరువైపులా నివాస, వాణిజ్య ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందాయని, 'మినీ బైపాస్" ఉన్నప్పటికీ, అది కూడా నగర అంతర్భాగంలోనే ఉండడం వల్ల భారీ వాహనాల రాకపోకలతో రద్దీగా మారిందన్నారు. విజయవాడ, తిరుపతి, చెన్నై మార్గంలో ప్రయాణించే వాహనాలు నెల్లూరు నగరం మీదుగా వెళ్లాల్సి రావడం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరుగుతోందని, దీంతో ప్రమాదాల సంఖ్య అధికం కావడమే కాక, కాలుష్యం కూడ ఎక్కువైందని అన్నారు. నెల్లూరు నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, సమగ్ర ప్రణాళికతో ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా ప్రారంభించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# వెయ్యికోట్లతో.. 5వేల ఆలయాలు మంత్రి ఆనం

తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా 5 వేలకు పైగా ఆలయాలు నిర్మిస్తున్నామని, దాదాపు వెయ్యికోట్ల రూపాయల వ్యయంతో ఈ ఆలయాల నిర్మాణం జరుగుతోందని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు జిల్లా అనుమసముద్రంపేట మండలం వేల్పులగుంట గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే ఆలయాలకు ధూప దీప నైవేద్యం పథకం ద్వారా ప్రతి ఆలయ అర్చకుడికి నెలకు రూ.10వేలు చెల్లిస్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాలు అమలవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి రూపొందించిన పీ4 పథకం ప్రజలకెంతోమేలు చేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా బండారుపల్లి గ్రామానికి చెందిన బాలుడి కుటుంబాన్ని తన కుమార్తె లీలా కైవల్యా రెడ్డి దత్తత తీసుకుని అండగా నిలిచిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. కృత్రిమ కాలు ఏర్పాటు చేయించి ఆ బాలుడి భవిష్యత్తుకు బాటలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అనేక మంది గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. అనంతరం ఉజ్వల పథకం ద్వారా మంజూరైన గ్యాస్ కనెక్షలను మంత్రి పంపిణీ చేశారు. డిఆర్డిఏ పీడీ నాగరాజకుమారి, ఆర్డీవో పావని, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



పెన్షన్ పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

## మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా సత్యనారాయణ

నెల్లూరులోని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా యు.సత్యనారాయణ ఈనెల 4న బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పోలీసు సిబ్బంది ఆయనను స్వాగతించి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహిళల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## టపాసుల కేంద్రాల్లో తనిఖీలు

నెల్లూరు నగరంలోని పొర్లుకట్ట వద్ద ఉన్న టపాసుల తయారీ కేంద్రాలు, విక్రయకేంద్రాలు, గోడౌన్లలో పోలీసులు, రెవెన్యూ, అగ్నిమాపక అధికారులు ఈనెల 4న ముమ్మరంగా తనిఖీలు చేశారు. కాకినాడ వేట్లపాళెం వద్ద టపాసుల తయారీకేంద్రంలో జరిగిన పేలుడు దుర్ఘటన మరెక్కడా పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులు దుకాణదారులను హెచ్చరించారు ఆర్డీఓ అనూష సారధ్యంలో రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. లైసెన్సులు పరిశీలించి, భద్రతా ప్రమాణాలు ఎలా ఉన్నాయో చూశారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలని టపాసుల తయారీదారులకు చెప్పారు. ఏడీఎఫ్ఓ రాజా, సంతపేట పోలీసు ఇన్స్‌పెక్టర్ వైవీ సోమయ్య తదితరులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

# 'పీఎం సూర్యఘర్'ని సద్వినియోగం చేసుకోవాలి

సౌర విద్యుత్ వల్ల కలిగే ప్రయోజనాలను గ్రామాల్లోని ప్రజలు అవగాహన చేసుకుని, 'పీఎం సూర్యఘర్' పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఇఓ శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 4న నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యుత్‌శాఖ ఎస్ఇ రాఘవేంద్రంతో కలసి సమావేశంలో మాట్లాడారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని వారు వివరించారు. పీఎం సూర్యఘర్ పథకానికి దరఖాస్తులు చేసుకుంటే బ్యాంకులు 7 శాతం వడ్డీతో రుణాలు కూడా ఇస్తాయని తెలిపారు.

# చెడిపోయిన చేపల్ని అమ్మేస్తున్నారు

## • మైపాడురోడ్డులోని చేపలమార్కెట్‌లో ఇదీ సంగతి



నెల్లూరు నగరంలో చేపల వ్యాపారులు అనేక మంది పాడైపోయిన చేపల్ని కూడా అమాయక జనానికి అమ్మేస్తున్నారు. వ్యాపారుల వద్ద రోజుల తరబడి ఫ్రిజ్‌లలో మురిగిపోయి ఉన్న చేపల్ని ఈనెల 4న కార్పొరేషన్ ఆరోగ్యాధికారి డాక్టర్ దినేష్ ఆధ్వర్యంలోని బృందం వెలికితీసింది. మైపాడురోడ్డులోని చేపల మార్కెట్‌లో తనిఖీలు చేసి పాడైపోయిన చేపలను స్వాధీనం చేసుకున్నారు. వాటన్నిటినీ ప్రత్యేక వాహనంలో తరలించి, వాటిపై పినాయిల్ పోసి నిర్వీర్యం చేశారు. చెడిపోయిన చేపలను, ఇతరత్రా ఆహారపదార్థాలను విక్రయించడం నేరమని, ఇదే విధంగా తప్పిదాలు చేస్తూ వ్యాపారాలు సాగిస్తే కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా వారిని హెచ్చరించారు.

లాయర్
మార్చి 06, 2026

# కంపు చేస్తున్న ట్రంప్!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచాన్ని కంపు చేస్తున్నాడు. ఆయన అనుసరిస్తున్న "అమెరికా ఫస్ట్" విధానం అమెరికాలోని ఒక వర్గానికి నచ్చవచ్చేమో, కానీ ప్రపంచ శాంతి విషయంలో అది అనేక సవాళ్లను విసురుతోంది. పేనుకు పెత్తనమిస్తే.. తలంతా గొరిగేసిందంట.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఈ మాట అక్షరాల సరిపోతుంది. ఎందుకంటే గతంలో ఓసారి అధ్యక్షుడిగా పనిచేసి.. మరోసారి ఓటమి పాలైనా పట్టువదలని విక్రమార్కుడిలా మళ్లీ గెలిచి నిలిచి అధ్యక్ష పీఠాన్ని అధిరోహించడం ట్రంప్ పట్టుదలకు నిదర్శనం. అయితే, రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిలకడలేని నిర్ణయాలు.. ఊకదంపుడు ప్రకటనలకు ఆయన కేరాఫ్ అడ్రస్‌గా మారడం అమెరికా పాలిట శాపంగానే భావించాల్సి ఉంటుంది. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ అంటూ తన పాలనా సారాంశాన్ని ఒక్కముక్కలో చెప్పి గద్దెనెక్కిన ట్రంప్ పాలనా కాలంలో మంచికంటే చెడు విషయాలపైనే కాదుకాదు.. వివాదాస్పద విషయాలపైనే ఎక్కువగా దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. దీనికి నిదర్శనం తన నిర్ణయాల వల్ల అమెరికా పౌరులే అందరికంటే ఎక్కువ ఇబ్బంది పడుతున్నారని తెలిసినా.. ఆయన వెనక్కి తగ్గకపోవడమే. తాజాగా ఆయన ఇరాన్‌పై మొదలుపెట్టిన యుద్ధం మూడో ప్రపంచ యుద్ధానికి బాటలు వేయడంతో పాటు ప్రపంచాన్నే ప్రమాదపుటంచుల్లోకి నెట్టేలా కనిపిస్తోంది. ట్రంప్ నిర్ణయాలు పిచ్చోడి చేతిలో రాయిని తలపిస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్ విషయంలో ఆయన చేసిన అనేక తప్పిదాలలో ప్రధానమైనది అణు ఒప్పందం నుండి వైదొలగడం. 2018లో ప్రపంచ అగ్రరాజ్యాలన్నీ కలిసి ఇరాన్‌తో కుదుర్చుకున్న అణు ఒప్పందం నుండి ట్రంప్ ఏకపక్షంగా బయటకు వచ్చారు. దీనివల్ల ఇరాన్ తన అణు కార్యకలాపాలను మళ్లీ వేగవంతం చేసే అవకాశం దక్కింది. చర్చల ద్వారా పరిష్కరించుకునే మార్గాన్ని మూసివేసి, కేవలం ఆంక్షలతో లొంగదీసుకోవాలనుకోవడం దౌత్యపరమైన వైఫల్యంగా భావించవచ్చు. ఎప్పుడూ ఆధిపత్యం చూపిస్తూ, అజమాయిషీ చెలాయించాలన్నదే ట్రంప్ విధానం. ఆయన ఇరాన్ అగ్రనేతలను నేరుగా విమర్శించడం, బెదిరించడం వంటివి ఆ దేశంలోని అతివాద శక్తులను మరింత బలోపేతం చేశాయన్నది ఎవరూ కాదనలేని నిజం. అంతర్జాతీయ రాజకీయాల్లో 'ముఖాముఖి' పోరాటం కంటే 'చదరంగం' లాంటి వ్యూహాలు ముఖ్యం. ట్రంప్ నేరుగా యుద్ధానికి దిగడం వల్ల ఇరాన్ వంటి దేశాలు రష్యా, చైనాలకు మరింత దగ్గరయ్యే పరిస్థితి ఏర్పడింది.

డొనాల్డ్ ట్రంప్ వ్యక్తిత్వాన్ని మనం గమనిస్తే ట్రంప్ ఎప్పుడూ తనను తాను ఒక "గొప్ప డీల్ మేకర్"గా భావిస్తారు. "నేను మాత్రమే దీనిని పరిష్కరించగలను" అనే ధోరణి ఆయనలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ అహంకారం వల్ల ఆయన తన సలహాదారుల మాటలను కూడా పక్కన పెట్టి, ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారు. రాజకీయాల్లో ఒక పద్ధతి ఉండాలి, కానీ ట్రంప్ ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో, ఎవరిపై ఏ ట్వీట్ చేస్తారో ఎవరికీ అర్థం కాదు. శత్రువులను అయోమయంలో పడేయడానికి ఇది ఒక వ్యూహం అని ఆయన మద్దతుదారులు అన్నా, అది ప్రపంచ శాంతికి మాత్రం ముప్పు అన్న విషయం మనం గమనించాలి. ట్రంప్ అహంకార పూరిత పోకడ వల్ల అమెరికా భవిష్యత్తులో అనేక సవాళ్ళని ఎదుర్కొంటుందనడంలో సందేహం అవసరం లేదు. ముఖ్యంగా ఒక ఒప్పందం చేసుకుని, మరుసటి రోజు దాని నుండి బయటకు వచ్చే ట్రంప్ లాంటి నాయకుడిని ఏ దేశమూ నమ్మదు. జర్మనీ, ఫ్రాన్స్ వంటి యూరప్ దేశాలు ఇప్పటికే అమెరికాపై ఆధారపడటం తగ్గించి, తమకంటూ ఒక సొంత రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ఆలోచిస్తున్నాయి. అమెరికా ఒంటెత్తు పోకడ వల్ల రష్యా, చైనా, ఇరాన్ ఒక కూటమిగా ఏర్పడ్డాయి. ఇది ప్రపంచాన్ని రెండు ముక్కలు చేసే ప్రమాదముంది. గతంలో అమెరికా చెప్తే లోకం వినేది, కానీ ఇప్పుడు ఖచ్చితంగా ఆ పరిస్థితి లేదు. ట్రంప్ ఆర్థిక ఆంక్షలను ఒక ఆయుధంగా వాడుతుండటంతో, చాలా దేశాలు డాలర్ కాకుండా తమ సొంత కరెన్సీల్లో వ్యాపారం చేయడానికి మొగ్గు చూపుతున్నాయి. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థకు దీర్ఘకాలంలో పెద్ద దెబ్బ.

ఇరాన్-అమెరికా యుద్ధప్రభావం మన భారతదేశంపై చాలా తీవ్రంగా ఉంటుంది. ముఖ్యంగా సామాన్యుడి జేబుకు చిల్లు పడేలా ఈ ప్రభావం కనిపిస్తుంది. భారత్ తన చమురు అవసరాలలో దాదాపు 80% దిగుమతి చేసుకుంటుంది. మధ్యప్రాచ్యంలో యుద్ధం వస్తే చమురు సరఫరా ఆగిపోతుంది. హోర్ముజ్ జలసంధి(Strait of Hormuz) ఇది ఇరాన్ దగ్గర ఉన్న కీలకమైన సముద్ర మార్గం. ప్రపంచంలోని 20% చమురు ఇక్కడి నుంచే వెళ్తుంది. ఇప్పటికే ఇరాన్ దీనిని మూసేసింది. దీని ప్రభావంతో భారత్‌లో పెట్రోల్ ధరలు లీటరుకు రూ.150 - 200 దాటినా ఆశ్చర్యం పోనవసరం లేదు. చమురు ధరలు పెరిగితే, భారత్ ఎక్కువ డాలర్లను ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ తగ్గిపోతుంది. దీని ప్రభావం వల్ల మనం విదేశాల నుండి దిగుమతి చేసుకునే ఎలక్ట్రానిక్స్, వంట నూనెలు వంటి వాటి ధరలు కూడా మండిపోతాయి. పెట్రోల్ ధర పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి. కూరగాయల నుండి నిత్యావసర వస్తువుల వరకు అన్నింటి ధరలు అమాంతం పెరిగిపోతాయి. ఇది సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తుంది. దాదాపు 80 లక్షల మంది భారతీయులు గల్ఫ్ దేశాలలో (దుబాయ్, సౌదీ, ఖతార్ మొదలైనవి) పని చేస్తున్నారు. ప్రస్తుత యుద్ధం వాళ్ళ వారి ఉపాధి దెబ్బతినడమే కాకుండా, వారిని క్షేమంగా తిరిగి తీసుకురావడం ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. ట్రంప్ నిర్ణయాలు అమెరికాకు మాత్రమే కాకుండా, మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు కూడా శాపంగా మారే అవకాశం ఉంది. శాంతి అనేది కేవలం ఒక దేశానికి సంబంధించినది కాదు, అది ప్రపంచం మొత్తానికి అవసరం.

మహాభారతంలో దుర్యోధనుడికి ఎంతో సైన్యం ఉంది, కానీ కృష్ణుడు వంటి నీతిమంతుడి మద్దతు లేదు. చివరకు తన అహంకారం వల్ల మిత్రులందరినీ కోల్పోయి ఒంటరిగా మిగిలిపోయాడు. రాజకీయాల్లో "బలం" ఉండాలి కానీ, అది "విచక్షణ"తో కూడి ఉండాలి. దుర్యోధనుడికి బలం ఉంది కానీ విచక్షణ లేకపోవడం వల్ల వంశం నాశనమైంది. ట్రంప్ తీరు కూడా అలాగే ఉంటే, అమెరికా తన "అగ్రరాజ్యం" హోదాను కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ట్రంప్ తన దూకుడును తగ్గించి, చర్చల వైపు అడుగులు వేయకపోతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలా కుతలమవుతుంది. శాంతికి ముప్పు ఏర్పడుతుంది. మూడవ ప్రపంచ యుద్ధానికి బీజం పడుతుంది..!

# సానుభూతి కాదు.. సహకారం ఇవ్వాలి

మనసులో మాట 87

ప్రతి ఏటా మార్చి 8వ తేదీ రాగానే ప్రపంచమంతా ఒక్కసారిగా స్త్రీమూర్తి గొప్పతనం గురించి చర్చలు మొదలవుతాయి. సామాజిక మాధ్యమాల్లో శుభాకాంక్షలు, కార్యాలయాల్లో సన్మానాలు, వేదికలపై ఉపన్యాసాలతో సందడి కనిపిస్తుంది. అయితే, 2026 అంతర్జాతీయ మహిళా దినోత్సవం మన ముందు ఉంచిన 'గివ్ టు గెయిన్' (వృద్ధి కోసం తోడ్పాటు) అనే నినాదం, ఈ వేడుకలను కేవలం ఒక రోజు సంబరంగా కాకుండా, ఒక నిరంతర బాధ్యతగా మార్చాలని గుర్తు చేస్తోంది.

## 'గివ్ టు గెయిన్' అంటే ఏమిటి?

సాధారణంగా ఏదైనా ఇస్తే మన దగ్గర ఉన్నది తగ్గిపోతుందని భయపడతాం. కానీ మహిళల విషయంలో ఇచ్చే ప్రతి చిన్న సహకారం, పెట్టుబడిగా మారి సమాజానికి రెట్టింపు లాభాన్ని తెచ్చిపెడుతుంది. 'గివ్ టు గెయిన్' అంటే కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు; అది సమయం కావచ్చు, నైపుణ్యం కావచ్చు, లేదా ఒక మహిళ ఆలోచనకు ఇచ్చే గుర్తింపు కావచ్చు. ఒక మహిళకు మనం ఇచ్చే ప్రతి ప్రోత్సాహం, ఆమె కుటుంబానికి, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతాన్నిస్తుంది. స్త్రీలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినప్పుడు ఆ ప్రభావం కేవలం వారిపైనే కాదు, రాబోయే తరాలపై కూడా సానుకూలంగా ఉంటుంది.

## చరిత్ర నుండి వర్తమానం వరకు..

1900వ దశకం ఆరంభంలో పని గంటల తగ్గింపు, మెరుగైన వేతనాలు, ఓటు హక్కు కోసం న్యూయార్క్ వీధుల్లో మహిళలు చేసిన పోరాటం నేడు ప్రపంచ వ్యాప్త ఉద్యమంగా మారింది. 1975లో ఐక్యరాజ్యసమితి దీనిని అధికారికంగా గుర్తించినప్పటి నుండి, మహిళల హక్కుల విషయంలో ప్రపంచం ఎంతో పురోగతి సాధించింది. కానీ, నేటికీ 2026లో కూడా మనం సమాన పనికి సమాన వేతనం, పని ప్రదేశాల్లో భద్రత, నిర్ణయాధికారాల్లో భాగస్వామ్యం గురించి చర్చించుకోవాల్సి వస్తోంది. మన దేశంలో 'బేటీ బచావో – బేటీ పఢావో', 'ముద్రా యోజన' వంటి పథకాలు మహిళా విద్యను, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇంకా మార్పు రావాల్సి ఉంది.

## సహకారం ఎలా అందించాలి?

మహిళా సాధికారత అనేది అందరూ కలిసి చేయాల్సిన యజ్ఞం. ఇప్పటికే ఉన్నత స్థానాల్లో ఉన్న మహిళలు, తమ అనుభవాలను తోటి మహిళలతో పంచుకోవాలి. మహిళా పారిశ్రామికవేత్తలకు పెట్టుబడులు అందేలా చూడటం ద్వారా వారిని ఆర్థికంగా స్వతంత్రులను చేయవచ్చు. ఇంట్లో మహిళల పని భారాన్ని పురుషులు పంచుకున్నప్పుడే, వారు తమ వృత్తిపరమైన లక్ష్యాలవైపు అడుగులు వేయడానికి తగిన సమయం దొరుకుతుంది. అప్పుడే వారు తమ ప్రతిభను సమాజానికి అందించగలరు.

మహిళా సాధికారత అనే చర్చ వచ్చిన ప్రతిసారీ 'వివక్ష' అనే అంశం తప్పనిసరిగా తెరపైకి వస్తుంది. అయితే, వివక్ష ఉందా లేదా అన్న ప్రశ్న కంటే, అసలు 'వివక్ష' అంటే ఏమిటి? అనే విషయంలో సమాజానికి సరైన స్పష్టత ఉండాలి. మహిళలైనా, పురుషులైనా లేదా మొత్తం సమాజమైనా సరే – ఏది వివక్ష, ఏది ప్రకృతిసిద్ధమైన వైవిధ్యం అనేది సరిగ్గా అర్థం చేసుకోగలిగితే ఒక ఆదర్శవంతమైన సమాజం తయారవుతుంది.

ఉదాహరణకు శ్రామికశక్తిని తీసుకుంటే.. ప్రకృతి పరంగా స్త్రీ పురుషుల శారీరక, మానసిక స్వభావాలు వేరువేరుగా ఉంటాయి. కొన్ని కఠినమైన శారీరక శ్రమల్లో పురుషుల ఉత్పత్తి సామర్థ్యం ఎక్కువగా ఉండవచ్చు. మహిళలు కూడా తమ 100% శ్రామికశక్తిని ధారపోసినా, ఫలితంలో కొంత వ్యత్యాసం కనిపించవచ్చు. దానికి కారణం వారు తక్కువ కష్టపడటం కాదు, ప్రకృతి సిద్ధమైన శారీరక నిర్మాణంలోని వైవిధ్యం మాత్రమే. వారు తమ సామర్థ్యాన్ని పూర్తిగా వెచ్చించినా, శారీరక తత్వం వల్ల వచ్చే ఈ వైవిధ్యాన్ని మనం తక్కువ చేసి చూడకూడదు.

ఈ ప్రాథమిక సత్యాన్ని మనం గ్రహించనప్పుడే 'వివక్ష' అనే వివాదం పుడుతుంది. నిజమైన వివక్ష ఎక్కడ మొదలవుతుందంటే.. సామర్థ్యం ఉండి కూడా కేవలం స్త్రీ పురుష వ్యత్యాసం ఆధారంగా అవకాశాన్ని నిరాకరించినప్పుడు. కానీ, ఒక మహిళ తన ప్రకృతి సిద్ధమైన పరిమితులకు లోబడి తన 100% శ్రమను ధారపోస్తున్నప్పుడు ఆమెను పురుషుడితో పోల్చి తక్కువ చేయడం కాకుండా, ఆమె పడిన 'శ్రమ'ను ప్రాతిపదికగా తీసుకుని గుర్తింపునివ్వాలి. పురుషులు, మహిళల మానసిక మరియు శారీరక స్వభావాలు వేరు. ఈ వైవిధ్యాన్ని మనం లోపంగా కాకుండా, ఒక ప్రత్యేకతగా చూడాలి. ఎప్పుడైతే మనం ఒకరి స్వభావాన్ని మరొకరం సరిగ్గా అర్థం చేసుకుంటామో, అప్పుడు వివక్ష అనే ప్రశ్నకే తావుండదు.

మహిళా దినోత్సవం అంటే కేవలం ఒక రోజు సెలవు తీసుకోవడమో లేదా శుభాకాంక్షలు చెప్పడమో కాదు. ఇది ఒక ఆత్మపరిశీలన సమయం. మనం మహిళలకు ఇచ్చే గౌరవం, అవకాశం, మద్దతు అనేవి వృథా పోవు. అవి రేపటి సమాజానికి బలమైన పునాదులు వేస్తాయి. స్త్రీ పురుషులు ఒకరినొకరు పోటీదారులుగా కాకుండా, ఒకరికొకరు అదనపు బలంగా భావించి, ఒకరి వైవిధ్యాన్ని మరొకరు గౌరవించుకున్నప్పుడే నిజమైన సమానత్వం సాధ్యమవుతుంది. ఈ మహిళా దినోత్సవం నాడు, అటువంటి అవగాహనతో కూడిన మార్పు వైపు అడుగులు వేద్దాం.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# నాటి కీర్తిమూర్తులతో.. రేపటి తరానికి స్ఫూర్తి!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

"కీర్తిమూర్తులు" శీర్షికతో పుణ్యలోకాలకేగిన ధన్యజీవులని సంస్మరించుకుంటున్న మన 'లాయర్'కి ముందుగా నా అభినందనలు. ముఖ్యంగా నాటి తరం మహనీయులు సాధించిన విజయాలు రేపటి తరానికి స్ఫూర్తిని కలిగిస్తాయి. తన అసామాన్య ప్రతిభాపాటవాలతో చిత్ర రంగంలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా అపారకీర్తిని సాధించిన నెల్లూరీయుడు యరగుడిపాటి వరదారావు (వై.వీ.రావు) గురించి రెండు వారాల క్రితం 'లాయర్'లో చదివి నాకు చాలా సంతోషం కలిగింది. వంద సంవత్సరాల క్రితమే వై.వీ.రావు చేసిన ప్రయోగాలు చిరస్మరణీయం. ఆయన కుటుంబసభ్యులతో నాకు అత్యంత సాన్నిహిత్యం ఉంది. ఇప్పుడు నా వయస్సు 87సంవత్సరాలు. వై.వీ.రావు గారితో కూడా నాకు పరిచయం వుంది. వారిని రెండుసార్లు కలిశాను. ఆయన జీవిత కథని సీరియల్‌గా ప్రచురిస్తే బాగుంటుందని నా కోరిక.

వి.ఎ.కే.రంగారావు, మద్రాసు.

# బాలు విగ్రహం సంతోషదాయకం

నెల్లూరు నగరంలో దివంగత ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారి విగ్రహ ప్రతిష్ఠకి భూమిపూజ జరగడం సంతోషదాయకం. యావత్ భారత జాతి గర్వించే గాయకుడు మన బాలసుబ్రహ్మణ్యం. పాడుతా తీయగా అంటూ ఎంతో మంది నవతరం గాయనీ గాయకులని సంగీత ప్రపంచానికి అందించిన ఘనత బాలూ గారిది. ఆయన విగ్రహాన్ని బాలు జన్మస్థలంలో ఏర్పాటు చేయడానికి స్ఫూర్తి కలిగించిన వెంకయ్యనాయుడు గారికీ, విగ్రహ స్థాపనకి శ్రమిస్తున్న కార్య నిర్వాహక బృందానికి నా సునమస్సులు.

లక్ష్మీభరద్వాజ్, హైదరాబాదు.

# రైతుల అభ్యున్నతే.. ముఖ్యం



• మంత్రి ఆనం

రైతుల అభ్యున్నతే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని, వ్యవసాయానికి అగ్రపీఠం వేస్తూ ప్రభుత్వం ఎన్నో పథకాలను రైతన్నల కోసం అమలుచేస్తోందని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. మార్చి 1న ఆయన మండల కేంద్రమైన సంగంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డితో కలిసి ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతులకు ధాన్యానికి మంచి ధర కల్పించాలని జిల్లాలో ముందుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. పంట పండించిన ఏ ఒక్క రైతు కంట కన్నీరు రాకూడదనే సంకల్పంతో ప్రభుత్వం ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. రైతులకు మద్దతు ధర అందించడమే కాకుండా బహిరంగ మార్కెట్లో మద్దతు ధర కంటే ఎక్కువ ధర దక్కేలా ముందుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసే విధంగా ఏర్పాట్లు జరిగాయన్నారు. రైతులకు ఎటువంటి సమస్యలు ఎదురైనా ఒక్క ఫోన్ కాల్‌తోనే వెంటనే పరిష్కారం అందించే విధంగా వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప, పౌర సరఫరాల సంస్థ డీఎం అర్జున్‌రావు, డీఎస్‌ఓ లీలారాణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ జనార్దన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆనంను కలసిన.. కొత్త మేయర్



నెల్లూరు నగర మేయర్‌గా ఇటీవలే ఎంపికైన దేవరకొండ సుజాత ఈనెల 1న నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి ధన్యవాదాలు తెలిపారు. మంత్రి ఈ సందర్భంగా మేయర్ సుజాతను అభినందిస్తూ, నెల్లూరు నగర అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు.



# సంక్షేమ సమాజం రావాలంటే.. ఇలాంటి కలెక్టర్‌లు కావాలి

## శెహభాష్ హిమాన్షు శుక్లా!

ప్రజల కష్టాలకు మానవీయ హృదయంతో స్పందిస్తూ, వారి సమస్యలను తీరుస్తున్న కలెక్టర్‌గా.. హిమాన్షు శుక్లా జిల్లా ప్రజల అభినందనలు అందుకుంటున్నారు. ఇటీవల ఓ వృద్ధురాలి బాధను విన్న కలెక్టర్, ఆమె సమస్యల పరిష్కారానికి వెంటనే అధికారులను ఆదేశించడం, ఆ సమస్య తీరిపోవడంతో వృద్ధురాలి సంతోషం అంతాఇంతా కాదు. నేరుగా ఆమె కలెక్టరేట్‌కి వచ్చి స్వీట్లు పంచి ఆనందించడం విశేషం. సంక్షేమ సమాజం రావాలంటే ఇలాంటి కలెక్టర్‌లు కావాలని కోరుకుంటూ.. కలెక్టర్ హిమాన్షు పనితీరును అందరూ కొనియాడుతున్నారు.



కలెక్టర్ హిమాన్షు శుక్లాకి కృతజ్ఞతలు తెలుపుతున్న వృద్ధురాలు రమాజ్యోతి



వృద్ధురాలి దీనగాథను తెలుసుకుంటున్న కలెక్టర్ (ఫైల్ ఫోటో)

సాధారణంగా కలెక్టరేట్‌కి ప్రజలు వచ్చి అర్జీలివ్వడం మామూలే. అయితే, వాటిలో సత్వర పరిష్కారం లభించే అర్జీలు ఏ కొన్ని మాత్రమే ఉంటాయి. జిల్లా కలెక్టర్‌లా వాటి పట్ల చొరవ చూపితే ప్రజల సమస్యలు త్వరితగతిన తీరిపోతాయనేందుకు ఇటీవల జరిగిన ఓ సంఘటన నిరూపిస్తోంది. జిల్లా కలెక్టర్‌కు తన బాధలు వినిపించుకోవాలని రమాజ్యోతి అనే వృద్ధురాలు కలెక్టరేట్‌కి వచ్చి, నడవలేని స్థితిలో కూలబడి ఉండగా, అటుగా వెళ్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల గమనించారు. వెంటనే ఆమె వద్దకు వెళ్ళి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెకి వచ్చిన కష్టమేమిటో ఆమె మాటల్లోనే విన్నారు. ఆమె పెద్దకొడుకు తాను నివసిస్తున్న ఇంటిని తన పేరు మీద రాయించుకుని, తనను ఇంటి నుంచి వెళ్ళగొట్టాడని, తనకు నిలువ నీడ లేకుండా చేశారని వాపోవడంతో, తక్షణమే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిచి ఆమెకు వెంటనే న్యాయం చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఆగమేఘాలపై కదిలారు. ఎలాంటి జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో ఆ సమస్యను పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. చట్ట ప్రకారం వ్యవహరించి, ఆమె ఇంటిని ఆమెకు దక్కేలా చేశారు. ఎంతోకాలంగా ఉన్న సమస్య.. అనూహ్యంగా ఒకే ఒక్క అర్జీతో పరిష్కారం కావడంతో ఆమె ఆనందానికి అవధుల్లేవు.

జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తర్వాత, హిమాన్షు శుక్ల నిర్వహించిన తొలి గ్రీవెన్స్ డే కార్యక్రమంలో అందిన మొట్టమొదటి అర్జీ కూడా ఇదే కావడం విశేషం! వృద్ధురాలి సమస్యను వినడంతోనే కలెక్టర్ మానవీయ దృక్పథంతో స్పందించడం అందరినీ ఆకట్టుకుంది. తాజాగా, ఆ ఇంటిని తనకు ఇప్పించిన కలెక్టర్‌కు స్వయంగా కృతజ్ఞతలు చెప్పాలని, శరీరం సహకరించకపోయినా ఎట్లనో కష్టపడి ఆ వృద్ధురాలు సోమవారం కలెక్టరేట్‌కి వచ్చారు. అయితే, ఆ సమయంలో కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఆమె మళ్లీ బుధవారం వచ్చి కలెక్టర్‌ని కలిసి కృతజ్ఞతలు తెలిపి, ఆయన్ను మనసారా దీవించారు. ప్రజల అర్జీలపై తక్షణ స్పందన, మానవీయ దృక్పథం ఉంటే పరిపాలన ఎలా ఉంటుందో ఈ సంఘటన నిరూపిస్తోందని, 'శెభాష్..కలెక్టర్ హిమాన్షు'.. అంటూ ప్రజలు అభినందిస్తున్నారు.

# చికెన్ వ్యర్థాల పీడ..వదలడం లేదు

## ప్రజారోగ్యం నాశనం.. పట్టించుకోని అధికారగణం!



సంగం వద్ద ఇటీవల తనిఖీల్లో దొరికిన వాహనంలోని డ్రమ్ముల నుంచి చికెన్ వ్యర్థాలను వెలికితీసి, పూడ్చిపెడుతున్న అధికారులు

కల్తీ ఆహారాలతో ప్రజల ప్రాణాలు పోతున్నా..జిల్లా అధికారులు అలాంటివాటి పట్ల నిమ్మళంగానే ఉంటున్నారు. దీంతో, చికెన్ వ్యర్థాల పీడ..జిల్లాను వదలడం లేదు. చేపలగుంటల యజమానుల ధనాశకి ప్రజారోగ్యం గుల్లయిపోతూనే ఉన్నా, వారిలో ఎలాంటి మార్పు ఉండడం లేదు. ఏ తమిళనాడు, లేదా కర్నాటక ప్రాంతాల నుంచో కోసి పారేసిన కోళ్ల మాంసం ముక్కలను, అందులోనూ పూర్తిగా పనికిరాని వ్యర్థాలను, అత్యంత స్వల్ప ధరకి కొనుక్కొని డ్రమ్ముల్లో వేసుకుని జిల్లాకి తీసుకువస్తున్నారు. అప్పటికే కుళ్ళిపోయి, పాసిపోయి పురుగులు పట్టి గబ్బుకొడుతున్న ఆ వ్యర్థాలను చేపలగుంటల్లో మేతగా వేస్తున్నారు. వాటిని తిన్న చేపలు పొట్టలు ఉబ్బిపోయి, బరువెక్కుతాయి. దీంతో, ఆ చేపలని ఎక్కువ ధరలకి అమ్మేసి, యజమానులు లక్షలకి లక్షలు ఆర్జిస్తున్నారు. కానీ, ఆ చేపలను తినే అమాయక ప్రజలు మాత్రం నానా రకాల రోగాలతో బాధలు పడుతుంటారు. ఈ అక్రమ, అనైతిక, అసహ్యకర వ్యాపారం చేపల యజమానులకు బాగా లాభిస్తుండడంతో, ఏదోఒక రకంగా వాటిని తెచ్చి చేపలకి పెడుతున్నారు. వీటిపై ప్రభుత్వం నిషేధం విధించి ఉంది. అయినా, దొంగదారుల్లో వాటిని తెచ్చేస్తున్నారు.

### చెక్‌పోస్టులు దాటి వచ్చేస్తున్నాయ్

ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రానికి వచ్చే మార్గాల్లో ఎన్నో చెక్‌పోస్టులు ఉన్నా, వాటన్నిటినీ దాటుకుని, ఇవి జిల్లాలోని మారుమూల గ్రామాలకి సైతం ఎలా చేరుతున్నాయో..ఎవరికీ అంతుపట్టడం లేదు. రహదారుల్లో ఎప్పుడూ వాహనతనిఖీలు జరుగుతూనే ఉంటాయి. అసలు అలాంటి వాహనం దూరంగా ఉండగానే, ముక్కులు అదిరిపోయేంత దుర్వాసన వస్తుంటుంది. గ్రామాల్లోకి అవి రాకపోకలు సాగిస్తుంటే, ఆ గబ్బును భరించలేక గ్రామాల్లో ఉన్న ప్రజలు వాటిపై ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారు కూడా. అయినప్పటికీ, రహదారులమీద ఈ వ్యర్థ పదార్థాల వాహనాలు రాష్ట్రాల సరిహద్దులను దాటుకుని, జిల్లాలోకి వచ్చేస్తున్నాయంటే వాహన తనిఖీలు ఎంత బాగా జరుగుతున్నాయో ఊహించుకోవచ్చు. అవినీతిపరుల అండదండలతో ఇలాంటి వ్యాపారాలు ఎంతోకాలంగా జోరుగా జరుగుతూనే ఉన్నాయి.

ఇటీవల నెల్లూరుజిల్లా సంగం బ్యారేజీ వద్ద ఓ వాహనాన్ని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఆ మినీవ్యాన్ ఎక్కి చూస్తే, దాంట్లో ఒకటికాదు, రెండు కాదు.. ఏకంగా 14 డ్రమ్ముల్లో గబ్బు కొట్టే వ్యర్థ పదార్థాలు కనిపించాయి. ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో ఆ వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. వాటిని ఒక పెద్ద గొయ్యి తీసి పూడ్చిపెట్టారు. మత్స్య శాఖ, రెవెన్యూశాఖల అధికారులు వచ్చి పరిశీలించారు. అయితే, ఎక్కడో ఒకటో అరో తప్ప.. ఇలాంటి నిష్పాక్షిక తనిఖీలు జిల్లా అంతటా జరగడం లేదు.

### జోరుగా సాగుతున్న చికెన్ వ్యర్థాల రవాణా

జిల్లాలోని సంగం, కోవూరు, కొడవలూరు తదితర మండలాలతో పాటు, సముద్రతీర ప్రాంతాల్లోని అనేక గ్రామాల్లో కూడా లాభసాటిగా ఉన్న ఇలాంటి చేపలగుంటల వ్యాపారం చేసేవాళ్ళు కొల్లలుగానే ఉంటున్నారు. నిజాయితీగా చేపలసాగు చేసేవాళ్ళు ఏ కొద్దిమందో ఉంటారు. ఈ వ్యర్థపదార్థాల దందాలో పాత్రధారులతో పాటు వాటి వెనుక ఉన్న సూత్రధారుల సంగతి మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో, ఈ వ్యర్థాల రవాణా జోరుగా సాగిపోతూనే ఉంది. వాహనాల యజమానులు జరిమానాలు కట్టేసి, మళ్ళీ నిర్భయంగా వాటి రవాణాకి పాల్పడుతున్నారు. కుళ్లిపోయిన వ్యర్థాలతో చేపలని మేపుతూ తమ పబ్బం గడుపుకుంటున్నారు. ఈ వ్యర్థాలు ఏ గ్రామంలోకి వెళ్తున్నాయో, వాటిని ఎవరు తీసుకువెళ్తున్నారో, ఎవరు చేపలకి వేస్తున్నారో ఆయా గ్రామాల్లో అంతా బహిరంగ రహస్యమే. అయినా, ఎవరూ పట్టించుకోవడం లేదంటూ గ్రామాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా పోలీసు అధికారులు, కలెక్టర్ వంటి ఉన్నతాధికారులు రంగంలోకి దిగి, గ్రామాల్లోకి ఆ వ్యర్థాలు రాకుండా గ్రామకమిటీలను నిఘా బృందాలను ఏర్పాటుచేసి వాటిని అరికట్టకుంటే.. ప్రజారోగ్యానికి ప్రమాదం తప్పదు. అసలు, ఇతర రాష్ట్రాల నుంచి ఇంతకాలంగా చెక్‌పోస్టులను దాటుకుని ఆ దుర్గంధ వాహనాలు ఎలా జిల్లాలోకి వస్తున్నాయో.. నిఘా అధికారులు ఆరా తీస్తే.. వీటి వెనుక ఉన్న బండారమంతా బయటపడుతుందని గ్రామస్తులంటున్నారు. ప్రభుత్వం ఇలాంటి దుర్గంధవ్యాపారాలపై కఠినచర్యలు తీసుకోవాలని, అవసరమైతే చట్టాలను సవరించైనా వాటిని నియంత్రించాలని ప్రజలు కోరుకుంటున్నారు. లేకుంటే ఇదికూడా ఒక పెద్ద మాఫియాగా మారుతుందని గ్రామ ప్రాంతాల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# 31 మందికి.. సీఎంఆర్ఎఫ్ చెక్కులు



సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

అనారోగ్యం తదితరాలతో బాధలుపడుతున్న 31 మంది లబ్ధిదారులకు రూ.19లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. నెల్లూరులోని వేదాయపాళెం కార్యాలయంలో ఇటీవల ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం లబ్ధిదారులు సీఎం చంద్రబాబునాయుడుకి, ఎమ్మెల్యే సోమిరెడ్డికి తమ కృతజ్ఞతలు తెలిపారు.

## సైనిక్‌స్కూల్ ఫలితాల్లో..
# 'నేతాజీ' స్కూల్ ప్రతిభ



ఇటీవల విడుదలైన సైనిక్ స్కూల్ ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలలో నెల్లూరులోని శ్రీ నేతాజీ పైలెట్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. 2025-26 విద్య సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశం కోసం జనవరి 18వ తేదీన జరిగిన పరీక్షల్లో తమ కోచింగ్ సెంటర్ నుంచి 35 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, వారిలో 33 మంది విద్యార్థులు అర్హత సాధించారని స్కూల్ కరెస్పాండెంట్ నేతాజీ సుబ్బారెడ్డి తెలిపారు. మొదటి స్థానం ఎస్.వర్షిత, రెండవ స్థానం ఎం.అమితవ్, మూడవ స్థానం పి.కారుణ్య, నాలుగవ స్థానం జీవీబీ లోకేష్ సాధించారని తెలియజేస్తూ, ఆ విద్యార్థులందరినీ ఆయన అభినందించారు. స్కూల్ డైరెక్టర్లు నరేంద్రరెడ్డి, డాక్టర్ సుబ్రామ్, డాక్టర్ అలేఖ్యరెడ్డి, ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, ఏఓ చెంచయ్య, వైస్ ప్రిన్సిపల్ స్పందన, సైనిక్ స్కూల్ కోచింగ్ ఇన్‌చార్జిలు హేమలత, సుశీల, శ్యామల, సుమిత్ర, శిల్పా, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగ్రహణం - ఆలయాల మూత



ఈనెల 3న చంద్రగ్రహణం కావడంతో నగరంలోని ఆలయాలను ఉదయం 9 గంటల నుంచి మూసివేశారు. ప్రముఖ దేవాలయాలైన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం, శ్రీ రంగనాథస్వామి దేవాలయం, మూలస్థానేశ్వరాలయం, నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయాలను మూసివేసి, రాత్రి 7 గంటల తరువాత శుద్ధిచేసి, పూజల అనంతరం భక్తులను లోపలకి అనుమతించారు.

# హోలీ సంబరాలు

హోలీ పండుగ సందర్భంగా ఈనెల 3న నగర వీధుల్లో చిన్నారులు ఉత్సాహంగా రంగులు చల్లుకుంటూ ఆనందించారు. పెద్దలు కూడా అనేకమంది ఈ ఆనందోత్సవంలో పిల్లలతో పాటు పాల్గొన్నారు.






# నెల్లూరు కబుర్లు

# నగరానికి కొత్త శోభ

## ఆకట్టుకుంటున్న..'సూర్య నమస్కార' ప్రతిమలు



'సూర్య నమస్కార' ప్రతిమలను ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు నగర సుందరీకరణలో భాగంగా హరనాథపురం సర్కిల్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన అత్యద్భుతమైన 'సూర్య నమస్కార' ప్రతిమలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వాటిని ప్రారంభించారు. ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్య సందేశాన్ని చాటిచెప్పేలా తీర్చిదిద్దిన ఈ విగ్రహాలు నగరానికి కొత్త శోభను తెచ్చాయి. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, ముత్తుకూరు రోడ్డు సరిహద్దులో సూర్య నమస్కార విగ్రహాలు, వాటర్ ఫౌంటెన్ మరియు వాకింగ్‌ట్రాక్‌తో కూడిన ఆధునిక పార్క్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, మంత్రి నారాయణ చొరవతో నెల్లూరులో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనుల జాతర కొనసాగుతోందని సంతోషం వ్యక్తం చేశారు.

# డ్రెయినేజీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కిరణ్‌కుమార్

నెల్లూరు నగరంలో సుమారు 47 కోట్ల రూపాయల వ్యయంతో జరుగుతున్న కాలువలు, డ్రెయినేజీ పనుల నాణ్యతను రాయలసీమ రీజియన్ చీఫ్ ఇంజనీర్ (క్వాలిటీ కంట్రోల్) పి.కిరణ్‌కుమార్ ఈనెల 3న పరిశీలించారు. పలు కాలువల పనులను తనిఖీ చేసి, అధికారులకు సూచనలిచ్చారు. వెంకటేశ్వరపురం వద్ద జరుగుతున్న పెన్నానది రక్షణ గోడల పనులను కూడా ఆయన పరిశీలించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఎం.అనిల్‌కుమార్‌రెడ్డి, ఇమాం ఖాసి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల కోసం..ప్రత్యేక వేదిక

జిల్లాలో పారిశ్రామిక వినియోగదారులకి సంబంధించిన విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రతినెలా మొదటి బుధవారం రోజున నెల్లూరులోని విద్యుత్‌భవన్‌లో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఇ రాఘవేంద్రం తెలిపారు. ఆరోజున ఉదయం 10.30 నుంచి 11.30వరకు ఈ వేదిక నిర్వహించి విద్యుత్ సమస్యలను తెలుసుకుంటామని, పారిశ్రామిక వినియోగదారులు నేరుగా సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చి, ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఉపాధ్యాయుల ఆందోళన

రాష్ట్రంలోని ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘం నాయకుడు చిరంజీవి మాట్లాడుతూ, 12వ వేతన సంఘాన్ని ఏర్పాటుచేసి, ఉద్యోగులు-ఉపాధ్యాయులకు 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న కరువుభత్యం, 11వ పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని కోరారు. శివకోటారెడ్డి, పిచ్చిబాబు, రియాజ్, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# చండీహోమం

పౌర్ణమి సందర్భంగా ఈనెల 3న నెల్లూరు మూలాపేటలోని శ్రీ కంచికామాక్షిదేవి సమేత చంద్రమౌళీశ్వర స్వామి వారి దేవస్థానంలో మహా చండీ హోమాన్ని నిర్వహించారు. ఆదిదంపతులకు ప్రత్యేక అలంకారాలు, అభిషేకాలు, పూజలు చేశారు.

## డా. కిషోర్స్ రత్నం స్కూల్..
# వార్షికోత్సవ వేడుకలు



## ● అలరించిన చిన్నారుల నాట్యప్రదర్శనలు

నెల్లూరు సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్ రత్నం కిడ్స్ అండ్ రేస్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఇటీవల ఎంతో ఉత్సాహంగా జరిగాయి. స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రత్నలయ విన్యాసం'లో భాగంగా, దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రముఖ నాట్య రీతులను చిన్నారులు అత్యద్భుతంగా ప్రదర్శించి అందరి కరతాళధ్వనులందుకున్నారు. స్కూల్ డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు వారందరినీ అభినందించారు. తమ విద్యాలయంలో మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యను బోధిస్తూ, విద్యార్థులు ఉత్తమశ్రేణిలో రాణించేందుకు కృషిచేస్తున్నామని వారు ఈ సందర్భంగా తెలిపారు. జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపాల్స్ జాస్మిన్, నాగేంద్ర, మేనేజర్ అజయ్‌సింగ్, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల నిరసన



విజయవాడలో అంగన్‌వాడీలు చేపట్టిన మహాధర్నాలో రాష్ట్ర స్థాయి నేతలను అరెస్ట్ చేయడం అక్రమమంటూ నెల్లూరులో ఈనెల 3న అంగన్‌వాడీ నాయకులు నిరసనలు చేపట్టారు. సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక గాంధీబొమ్మ వద్ద నుంచి విఆర్‌సి వరకు అంగన్‌వాడీలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంగన్‌వాడీలకు గతంలో టీడీపీ నేతలు ఇచ్చిన హామీలను అమలుచెయ్యాలని, నెలసరి వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఈ ఆందోళనలో అంగన్‌వాడీ జిల్లా గౌరవాధ్యక్షురాలు షేక్ రెహనాబేగం, సీఐటియు నాయకుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించండి

తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలంటూ జిల్లాలోని శారీరక వికలాంగ ఉద్యోగుల నాయకులు కోరుతున్నారు. ఆ ఉద్యోగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు జి.కోదండరామయ్య ఆధ్వర్యంలో ఈనెల 3న నగరంలోని దర్గామిట్టలో జరిగిన సంఘం సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, జీఓ నంబరు 138 ప్రకారం విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగులకు 7 స్పెషల్ క్యాజువల్ లీవ్‌లు ఉపయోగించుకునే అవకాశం కల్పించాలన్నారు. సంఘం అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ, కాంట్రాక్ట్-ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పించాలని, సదరం సర్టిఫికెట్లను శాశ్వత ధృవీకరణలుగా పరిగణించాలని కోరారు.

# సాయిదర్బార్‌లో అగ్నిగుండ మహోత్సవం



నెల్లూరు పద్మావతినగర్‌లోని శ్రీ సాయి దర్బార్ అద్దాల మందిరం వద్ద నున్న ప్రాంగణంలో ఇటీవల శ్రీ సాయినాథ స్వామి, శ్రీ పాండురంగ స్వామివార్ల చతుర్థ ఆనంద అగ్నిగుండ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక గురువు లక్ష్మీసాయి ఆధ్వర్యంలో జరిగిన పండరి భజనలు అందరినీ ఆకట్టుకున్నాయి. గురువులు బల్లి శీను, తులసీరామ్, కృష్ణదాసు తదితరుల సహకారంతో భజనలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు 30 మంది పండరి భజన గురువులు వారి శిష్య బృందాలతో ఈ కార్యక్రమంలో పాల్గొనడం, మరో 500 మంది భక్తులు పండరిభజనలు, నృత్యాలు చేయడం విశేషం. అనేకమంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. సాయిదర్బార్ అద్దాల మందిరం ఛైర్మన్ మధుసాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య తదితరులు పర్యవేక్షించారు

## మంత్రి నారాయణ చొరవతో..
# కోటీ 25 లక్షలతో పొర్లుకట్ట రోడ్లు



రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారాయణ

మంత్రి నారాయణ చొరవతో నెల్లూరు నగరంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సుమారు 2 కోట్ల రూపాయల వ్యయంతో పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ఇటీవల ఆయన నగరంలో పర్యటించి పనులను పరిశీలించారు. గాంధీబొమ్మ సెంటర్‌లోని స్వతంత్ర పార్కు వద్ద 75 లక్షల రూపాయలతో మూడు డ్రైన్లు, కల్వర్టు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వానలు వరదలొస్తే నగరంలో తరచూ ముంపునకు గురవుతున్న పొర్లుకట్లపై కోటీ 25 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు వేసేందుకు కృషిచేస్తున్నామన్నారు. 15 కాలువల ఆధునీకరణతో నగర రూపురేఖలే మారనున్నాయని మంత్రి తెలిపారు. నగరంలో దోమల సమస్యను నివారించి, నెల్లూరును స్మార్ట్‌సిటీగా రూపుదిద్దుతామన్నారు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరపు సుబ్బారావు, నగర మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్లు తహసీన్ ఇంతియాజ్, రూప్‌కుమార్‌యాదవ్, కమిషనర్ నందన్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ తదితరులు పాల్గొన్నారు.



# జన్మభూమి సేవలో..
# డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి

- శంకర నేత్రాలయ వారి నేతృత్వంలో ఉచిత కంటి పొర చికిత్సా శిబిరం ఏర్పాటు
- ప్రారంభించిన సోమిరెడ్డి, డాక్టర్ ప్రేమ్‌రెడ్డి సేవలను కొనియాడిన మాజీ మంత్రి

*అమెరికాలో ప్రఖ్యాత వైద్యులుగా స్థిరపడిన డా. ప్రేమసాగర్‌రెడ్డి, తాను అమెరికాలో ఉన్నప్పటికీ, తన స్వస్థలమైన వెంకటాచలం మండలం నిడిగుంటపాళెం గ్రామానికి ఎంతోకాలంగా ఎనలేని సేవలందిస్తున్న విషయం తెలిసిందే! జన్మ భూమిపై ఆయన చూపుతున్న అభిమానం అంతా ఇంతా కాదు. అమెరికాలో ఎంతో గొప్పస్థాయిలో ఉంటూ, ప్రపంచ వైద్య సేవారంగంలోనే ఆయనో ఆణిముత్యంలా వెలుగొందుతుండడం ఒక్క మన జిల్లాకే కాదు, దేశానికే గర్వకారణం. పేదరోగులకి అవసరమైన చికిత్సలు ఉచితంగా అందించడం, నిరుపేద విద్యార్థుల విద్యావసతులకు కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతుండడం ఆయన దానగుణానికి నిదర్శనం.*




ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి స్వస్థలం వెంకటాచలం మండలంలోని నిడిగుంటపాళెం గ్రామం. పుట్టినగడ్డమీద మమకారంతో వారి నేతృత్వంలో చెన్నై, శంకర నేత్రాలయ వారి సారథ్యంలో తాజాగా ఉచిత కంటి పొర చికిత్సా శిబిరం ఏర్పాటు చేశారు. మార్చి 2వ తేదీ నుండి 11వ తేదీ వరకూ 10 రోజులపాటు ఈ ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుంది. తాజాగా పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాద్ రెడ్డి తమ స్వగ్రామం పాపిరెడ్డిపాళెం చుట్టుపక్కల గ్రామ ప్రజలకోసం ఇస్కపాళెం గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించిన విషయం తెలిసిందే! అదే తరహాలోనే డాక్టర్ ప్రేమ్ రెడ్డి కూడా తమ సొంత ఊరు నిండిగుంటపాళెంతో పాటుగా వెంకటాచలం మండలంలోని అన్ని గ్రామాల ప్రజల కోసం ఈ ఉచిత కంటిపొర చికిత్సా శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. మార్చి 4వతేదీ బుధవారం సాయంత్రానికి 305 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో ఇప్పటికి 69 మందిని శస్త్ర చికిత్స కోసం ఎంపిక చేశారు. ఈ శిబిరాన్ని మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రేమసాగర్‌రెడ్డి తండ్రి ననమాల సుందరరామిరెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన అనంతర ఆయన మాట్లాడుతూ, డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి ఎంతటి సహృదయులో వివరించారు. ప్రేమసాగర్‌రెడ్డి అమెరికాలో ఉన్నా, ఆయన ధ్యాసంతా జన్మస్థలమైన నిడిగుంటపాళెం అభివృద్ధిపైనే ఉంటుందన్నారు. చెన్నై శంకర నేత్రాలయతో కలిసి వారు కంటి శస్త్రచికిత్స శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. తాను పుట్టిన ఊరిపై ప్రేమతో ఆయన ఇప్పటికే కోట్లాది రూపాయల ఖర్చుతో నిడిగుంటపాళెం గ్రామాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారన్నారు. డాక్టర్ ప్రేమ్‌రెడ్డి ప్రతినిధులుగా స్థానికంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న రవీంద్రరెడ్డి, శ్రీహరిరెడ్డిలకు సోమిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# నెల్లూరులో.. గానగంధర్వుని స్మారకం!

- బాలూ విగ్రహం ఏర్పాటుకు.. ఎమ్మెల్యే కోటంరెడ్డి భూమిపూజ



ఎస్పీ బాలు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

భారతీయ సినీ గాయకుడు..గానగంధర్వుడు..ప్రపంచ ప్రఖ్యాత సినీగాయకుడు దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఏర్పాటుచేయాలనే బాలూ అభిమానుల కోర్కె త్వరలోనే నెరవేరబోతోంది. తన అద్భుతమైన గానంతో, అనేకభాషల్లో వేలాది పాటలను మధురాతిమధురంగా గానం చేసి అశేషప్రజలను ఆకట్టుకున్న సినీ నేపథ్య గాయకుడు.. మన నెల్లూరీయుడు.. బాలూ కాంశ్య విగ్రహాన్ని, ఆయన స్వస్థలమైన నెల్లూరులో ఏర్పాటుచేసేందుకు రంగం సిద్ధమైంది. నగరంలోని మినీ బైపాస్‌రోడ్డులో ఉన్న ఎన్టీఆర్ పార్కు వద్ద..అందులోనూ బాలూకి ఎంతో ప్రీతిపాత్రమైన అన్నమయ్య విగ్రహ కూడలిలో ఆయన స్మారకం ఏర్పాటు చేయాలనే నిర్వాహకుల సంకల్పం అందరి ప్రశంసలందుకుంటోంది. నెల్లూరురూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాలూ విగ్రహం ఏర్పాటుకు మార్చి 1వ తేదీ ఆదివారం ఉదయం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా భూమిపూజ జరిగింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎస్పీ బాలూ భారతీయ సంగీతానికి, చలనచిత్ర రంగానికి చేసిన అపారమైన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలచిన గానగంధర్వుడు..తెలుగుబిడ్డ..భరతమాత ముద్దుబిడ్డ ఎస్పీ బాలసుబ్రహ్మణం స్మారకంగా విగ్రహాన్ని ఏర్పాటుచేయనుండడం ఎంతో అభినందనీయమన్నారు. ఎస్పీ బాలూ గాత్రం తరతరాలకు స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. ప్రపంచ ప్రజల నీరాజనాలందుకున్న గాయకుడు బాలూ విగ్రహం నెల్లూరు రూరల్ పరిధిలోని అన్నమయ్య సర్కిల్ వద్ద ఏర్పాటు కానుండడం సంతోషకరమన్నారు. ఎస్పీ బాలూ నెల్లూరీయుడు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. బాలూని చిరస్థాయిగా గుర్తుంచుకునేలా విగ్రహాన్ని ఏర్పాటుచేస్తుండడం హర్షణీయమంటూ నిర్వాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, వీరిశెట్టి హజరత్‌బాబు తదితరులను ఆయన అభినందించారు. నెల్లూరులో బాలూ విగ్రహం లేకపోవడం పట్ల అభిమానులు ఆవేదన చెందుతున్న నేపథ్యంలో జూన్ 4న ఎస్పీ బాలూ జయంతి నాటికి విగ్రహం పూర్తిచేయాలనే ఆలోచనతో నిర్వాహకులు కృషిచేస్తున్నారని, ఆరోజున కూడా మరింత వైభవంగా ప్రముఖులందరి సమక్షంలో విగ్రహావిష్కరణ జరుగుతుందని ఆయన అన్నారు. 'లాయర్' పత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి, వీరిశెట్టి హజరత్‌బాబు, మురళీకృష్ణ హోటల్ అధినేత గ్రోసు సుబ్బారావు, బాలూ కుటుంబసభ్యులు ఆత్మకూరు భానుమూర్తి, నలుబోలు బలరామయ్యనాయుడు, కళాంజలి అనంత్, రియాజ్‌బాషా, డా. ఎం. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.






# రక్తదానమంటే.. ప్రాణదానమే!



రక్తదానం చేస్తున్న పోలీసులు

రక్తదానం ప్రాణదానంతో సమానమని ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్ చెప్పారు. మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా ఈనెల3న నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని రక్తదానం విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా పోలీసులు, ప్రజలు స్వచ్ఛందంగా 47 యూనిట్ల రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైస్‌ఛైర్మెన్ జనార్ధనరాజు, ఇన్స్‌పెక్టర్ బి.కల్యాణరాజు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు, పోలీసు అధికారులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## డా. రేవూరుకు..
# 'భారత భాషా భూషణ్' అవార్డు



అవార్డునందుకుంటున్న ఆర్.ఏ.పద్మనాభరావు

ప్రముఖ సాహితీవేత్త, మన నెల్లూరీయులు డా. రేవూరు అనంతపద్మనాభ రావును ప్రతిష్టాత్మకమైన 'భారత భాషా భూషణ్' అవార్డు వరించింది. మధ్య ప్రదేశ్‌లోని భోపాల్‌లో దాదాపు అరవై సంవత్స రాల చరిత్ర కలిగిన అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ వారు ఇటీవల ఆయనకు ఆ అవార్డును ప్రదానం చేశారు. శతాధిక గ్రంథకర్త..అష్టావధాని అయిన డా. రేవూరును 2026 సంవత్సరానికి గాను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. భోపాల్‌లోని దుష్యంతకుమార్ సంగ్రహాలయంలో జరిగిన సభలో పద్మశ్రీ విజయదత్త శ్రీధర్, పద్మశ్రీ కైలాస్‌చంద్రపంత్‌ల సమక్షంలో, ఆ సంస్థ అధ్యక్షులు డా. వీరేంద్రసింగ్, ప్రధాన కార్యదర్శి కృతి చతుర్వేదిల చేతుల మీదుగా ఆయన ఆ అవార్డును అందుకోవడం విశేషం. డా. రేవూరు తన సృజనాత్మక రచనల ద్వారా జాతీయ సమైక్యతను ఇనుమడింప జేస్తుండడం పట్ల ఆ సంస్థ వారు ఈ సందర్భంగా ఆయన్ను అభినందించి ఈ అవార్డుకు ఎంపికచేసినట్లు తెలిపారు. తెలుగు, ఇంగ్లీషు భాషల్లో డా.రేవూరు సుమారు నూట పాతికకి పైగా గ్రంథాలను వెలుగులోకి తెచ్చి, రచనా రంగంలో ఆయన చేస్తున్న అపూర్వ కృషిని వారు ప్రశంసించారు.

# మెట్టప్రాంతాల దాహార్తి తీర్చండి
## బీజేపీ నాయకుడు మిడతల వినతి



జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు తదితర మెట్టప్రాంతాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి ఇటీవల జాయింట్ కలెక్టర్‌కి విజ్ఞప్తి చేశారు. త్వరితగతిన సోమశిల హైలెవెల్ కెనాల్, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభించి అటు ప్రజలు, ఇటు మూగజీవుల దాహార్తిని తీర్చాలని వారు సూచించారు. కూటమి ప్రభుత్వం గత సంవత్సరం బడ్జెట్లో హైలెవెల్ భూ సేకరణకు 50 కోట్లు కేటాయించారని, అయితే జిల్లా అధికారులు 6 కోట్లు మాత్రమే వెచ్చించడంతో, ఈ ఏడాది బడ్జెట్లో అదనంగా ఒక్క రూపాయి కూడా నిధులను రాష్ట్రప్రభుత్వం కేటాయించలేదని, కొందరు అధికారుల నిర్లక్ష్యం ఉదయగిరి, ఆత్మకూరు ప్రజలకు శాపంగా మారిందని వారు తెలిపారు. మెట్టప్రాంత అడవులలో వర్షాభావం వలన త్రాగునీటి కోసం అడవులలో ఉండాల్సిన జంతువులు విధిలేని పరిస్థితుల్లో రోడ్లమీదకి వచ్చేస్తున్నాయన్నారు. మెట్టప్రాంతాల్లోని ఫ్లోరైడ్ పీడిత గ్రామాలను బాగుచేయాలంటే సోమశిల హైలెవెల్ కెనాల్ పనులను పూర్తిచేయాలని, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ నిర్మించాలని వారు కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఉదయగిరి బీజేపీ నాయకులు నరాల సుబ్బారెడ్డి, మూలే బాలకృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, రోశయ్య, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాచలం మండలంలో..
# 'మీనోత్సవం'



చేపపిల్లలను వదులుతున్న అధికారులు

వెంకటాచలం మండలంలోని సర్వేపల్లి రిజర్వాయర్‌లో ఇటీవల 6.43 లక్షల చేప పిల్లలు, వీరనకనుపూరు గ్రామంలోని చెరువులో మరో 2.10 లక్షల చేపపిల్లలను వదిలి అధికారులు 'మీనోత్సవం' నిర్వహించారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం కింద రిజర్వాయర్లు, చెరువుల్లో చేపపిల్లలను వదలడం ద్వారా మత్స్యసంపద వృద్ధికి ఈ కార్యక్రమం నిర్వహించారు. మత్స్యశాఖ సంయుక్త సంచాలకురాలు డా.కె.శాంతి, సహాయ సంచాలకులు ఎస్.శ్రీనివాసులు, షేక్ చాంద్‌బాషా, వెంకటాచలం మత్స్యసహాయ పరిశీలకులు ఏ.పొట్టెయ్య, సర్వేపల్లి రిజర్వాయర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మెన్ నాగార్జునరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు రాపూరు రాధాకృష్ణనాయుడు, వెంకటాచలం మండలాధ్యక్షులు కె. రాధాకృష్ణారెడ్డి, వీరనకనుపూరు ఎఫ్‌సీఎస్ అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సైన్స్ దినోత్సవం



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లూరులోని వెంగళరావునగర్‌లో ఉన్న మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఇటీవల జాతీయ సైన్స్ దినోత్సవం జరిగింది. విద్యార్థులంతా సైన్స్‌ను అవగాహన చేసుకుని శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులవాణి ఈ సందర్భంగా తెలిపారు. ఆమేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయులు జెఎస్ భూషణ్‌కుమార్; కె.రాజకుమారి, టి.వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు. జనవిజ్ఞాన వేదిక సభ్యుడు ఎస్. వెంకటేశ్వర్లు తన పాటలతో అందరినీ ఆకట్టుకున్నారు.

## కవితల పోటీల్లో..
# ఇంద్రగంటికి ప్రథమ బహుమతి



గుంటూరులోని పొత్తూరులో శ్రీకార్తీక డెవలపర్స్, సాహితీ కిరణం పత్రిక సంయుక్త ఆధ్వర్యంలో, ఉగాదిని పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన కవితల పోటీల్లో నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి ఇంద్రగంటి మధుసూదన్‌రావు ప్రథమ బహుమతిని సాధించారు. ఈనెల 14న సాహితీకిరణం కార్యాలయంలో జరిగే ఉగాది సంబరాల్లో ఆయనకు ఆ బహుమతి కింద సన్మానంతో పాటు, రూ.2,500 నగదు బహుమతిని కూడా ప్రదానం చేయనున్నారు.

# పాఠ్యపుస్తకం చదవడం కూడా..ఒక నైపుణ్యమే!

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

**విద్యార్థి జీవితంలో పాఠ్యగ్రంథం అనేది కేవలం పరీక్షల కోసం చదవాల్సిన పుస్తకం కాదు; అది ఒక విషయం యొక్క మూలాన్ని లేదా ఆత్మను అర్థం చేసుకునే ద్వారం. పాఠ్యగ్రంథం చదివే విధానంలోనే విద్యార్థుల జ్ఞానపరిధి ఏపాటిదో అవగతమవుతుంది. చాలామంది విద్యార్థులు పుస్తకం తెరిచి మొదటి పేజీ నుంచి చివరి పేజీ వరకు చదవడం ప్రారంభిస్తారు. అది చదువు కాదు; దారి తెలియని ప్రయాణం. "దారి తెలిసినవాడికి దూరం భయం కాదు" అన్నట్లే, పాఠ్యపుస్తకం చదవడంలో కూడా, ముందుగా దాని నిర్మాణం, ఉద్దేశ్యం, ముఖ్యాంశాలు తెలుసుకుంటే చదువు పట్ల ఉన్న భయాలు లేదా అవరోధాలు వాటంతటవే తొలగిపోతాయి.**

విద్యార్థులు తమ పాఠ్యగ్రంథంలో ఒక అధ్యాయం చదవడానికి ముందు..ఆ అధ్యాయం ఏం చెప్పబోతుంది, దాని ప్రధాన భావం ఏమిటి, అది మనకు ఎందుకు అవసరం, పరీక్షలో అది ఎలా ఉపయోగపడుతుంది అనే స్పష్టత ఉండాలి. స్పష్టత లేని చదువు "కంటికి కనిపించిన దారిలో నడిచినట్టే".. అయోమయం. ఎక్కడికి చేరుతామోతెలియదు. కానీ ముందుగా అధ్యాయం శీర్షికలు, ఉపశీర్షికలు, బోల్డ్ పదాలు, పట్టికలు, గ్రాఫ్‌లు, చివర ఉన్న ప్రశ్నలు చూసినప్పుడు, మీ మెదడు ఒక మ్యాప్ తయారు చేస్తుంది. ఆ మ్యాప్ మీ చదువుకు దిశను ఇస్తుంది. తర్వాత మీరు చదివే ప్రతి పేరాగ్రాఫ్ ఆ మ్యాప్‌లోని ఒక భాగంలా అనిపిస్తుంది. ఈ పద్ధతి చదువును సులభం చేస్తుంది, వేగవంతం చేస్తుంది, ముఖ్యంగా అర్థం చేసుకునే శక్తిని పెంచుతుంది. చదువుతున్నప్పుడు..ఒక పేరాగ్రాఫ్ చదివిన తర్వాత పుస్తకం మూసి, "ఇప్పుడే చదివింది నా మాటల్లో ఎలా చెప్పగలను?" అని మనసులో ప్రశ్నించుకోండి. ఈ చిన్నచర్యే ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమైన పద్ధతి అయిన 'యాక్టివ్ రికాల్'. ఇది మీ మెదడును ఆలోచింపజేస్తుంది. ఆలోచించినప్పుడు మాత్రమే జ్ఞానం నిలుస్తుంది. పుస్తకాన్ని చూస్తూ చదివితే అది కేవలం కళ్ల పని; పుస్తకం మూసి ఆలోచిస్తే అది మెదడు పని. మెదడు పని చేసినప్పుడు మాత్రమే జ్ఞానం శాశ్వతమవుతుంది.

### పాఠం చివర ఉన్న ప్రశ్నలను నిర్లక్ష్యం చేయొద్దు :

"తన చేతి రాతే తనకు తోడు" అన్నట్లే, మీ మాటల్లో రాసిన నోట్స్ మాత్రమే పరీక్షలో మీకు తోడుంటాయి. ఒక అధ్యాయం చదివిన తర్వాత రెండు నిమిషాలు కేటాయించి, "ఈ అధ్యాయం యొక్క హృదయం ఏమిటి?" అని ఆలోచించి, మూడు నాలుగు లైన్లలో రాసుకుంటే, అది మీకు జీవితాంతం గుర్తుండే జ్ఞానం అవుతుంది. పాఠ్యగ్రంథంలో ఉన్న ఉదాహరణలు చదువును సులభం చేస్తాయి. ఉదాహరణలు లేకపోతే, మీరు స్వయంగా సృష్టించండి. అవి భావాలను స్పష్టంగా చూపిస్తాయి. ఉదాహరణలు ఉన్నప్పుడు పరీక్షలో రాయడం సులభమవుతుంది. ఒక సిద్ధాంతం అర్థం కాకపోతే, దాన్ని మీ జీవితంలోని ఒక చిన్న సంఘటనతో కలిపి చూడండి. అప్పుడు ఆ సిద్ధాంతం మీకు దగ్గరవుతుంది. పాఠ్యగ్రంథం మీకు మాట్లాడుతున్నట్లుగా అనిపిస్తుంది. "ఉదాహరణ లేకుండా ఉపదేశం వృథా" అని పెద్దలు చెప్పిన మాట చదువులో కూడా వర్తిస్తుంది. అధ్యాయం చివర ఉన్న ప్రశ్నలను చాలామంది విద్యార్థులు నిర్లక్ష్యం చేస్తారు. కానీ అవే మీకు ఉచిత పరీక్ష. ఆ ప్రశ్నలను ముందుగా చదివి, పుస్తకం మూసి, మీకు తెలిసినంత రాయండి. మీరు ఏం అర్థం చేసుకున్నారో, ఏం మిస్ అయ్యారో స్పష్టంగా తెలుస్తుంది. "తన తప్పు తెలిసినవాడే నిజమైన జ్ఞాని" అన్నట్లే, ఈ పద్ధతి మీ చదువును మెరుగుపరుస్తుంది.

### రోజూ చదువుకుంటే.. ఒత్తిడి ఉండదు :

పాఠ్యపుస్తకం చదివిన తర్వాత 24 గంటల్లో రివిజన్ చేయడం.. ఒక మాయ లాంటిది. మన మెదడు వెంటనే మరచిపోతుంది. కానీ అదే రోజున చిన్న రివిజన్ చేస్తే, జ్ఞానం 80 శాతం వరకు నిలుస్తుంది. రివిజన్ అంటే మళ్లీ మొత్తం అధ్యాయం చదవడం కాదు; మీ నోట్స్ చూడడం, మీ మాటల్లో ఒకసారి గుర్తు చేసుకోవడం. ఐదు నిమిషాలైనా సరిపోతుంది. చిన్న చిన్న రివిజన్‌లే పెద్ద జ్ఞానాన్ని నిలబెడతాయి. పాఠ్యగ్రంథం చదవడంలో విద్యార్థులు చేసే సాధారణ తప్పు.. చివరిరోజున రాత్రంతా కూర్చుని చదవడం. ఇది శరీరానికీ, మెదడుకీ, జ్ఞానానికీ హానికరం. చదువు అనేది ఒకరోజు చేసే పని కాదు; అది చిన్న చిన్న దశల్లో నిర్మించబడే ప్రక్రియ. ప్రతిరోజు కొద్దిగా చదివితే, చివరి రోజున ఒత్తిడి ఉండదు. పాఠ్యగ్రంథం మీకు భారంగా అనిపించదు. అది మీకు స్నేహితుడిలా అనిపిస్తుంది. "చిన్న చిన్న చుక్కలు చేరి చెరువవుతాయి" అన్నట్లే, చిన్న చిన్న చదువు దశలు పెద్ద విజయాన్ని తీసుకొస్తాయి. పాఠ్యగ్రంథాన్ని జయించే విద్యార్థి.. తన భవిష్యత్తును జయిస్తాడు. ఈ నైపుణ్యం ఉన్న విద్యార్థి తక్కువ సమయంలో ఎక్కువ నేర్చుకుంటాడు, పరీక్షల్లో ధైర్యంగా రాస్తాడు, ఒత్తిడిని తగ్గించుకుంటాడు, దీర్ఘకాలిక జ్ఞానం సంపాదిస్తాడు. పాఠ్యగ్రంథం చదవడం ఒక నైపుణ్యం; ఈ నైపుణ్యం మీ జీవితాన్ని మార్చగలదు. మీరు ఈ రోజు నుంచే చిన్న మార్పులు ప్రారంభించండి. ఒక అధ్యాయం ముందుగా స్కాన్ చేయండి, మీ మాటల్లో చిన్న నోట్స్ రాయండి, చదివిన తర్వాత పుస్తకం మూసి ఆలోచించండి, 24 గంటల్లో రివిజన్ చేయండి. ఈ నాలుగు అలవాట్లు మీ చదువును పూర్తిగా మార్చేస్తాయి. పాఠ్యగ్రంథం మీకు పనిచేయడం ప్రారంభిస్తుంది. మీరు దాన్ని జయించడం ప్రారంభిస్తారు.



**వచ్చే వారం:** చదివినది మరిచిపోకుండా ఉంచే నోట్స్ రహస్యాలు.

E-mail: reddyu@gmail.com



# శ్రీసిటీలో..జాతీయ భద్రతా వారోత్సవాలు

అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతిగాంచిన శ్రీసిటీ పారిశ్రామికవాడలో ఇటీవల 55వ జాతీయ భద్రతా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ ఆధ్వర్యంలో ఈనెల 4వతేదీ వరకు ఈ కార్యక్రమాలు జరిగాయి. శ్రీసిటీ సిబ్బంది, స్థానికులకు ఈ వారోత్సవాల ప్రాధాన్యతను వివరించి, వారిచే భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో..రోడ్డు ప్రమాదాలను, ఇతరత్రా జరిగే ప్రమాదాలను నివారించడానికి భద్రతా అంశాలపై ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు అవగాహన పెంచడమే ఈ భద్రతా వారోత్సవాల లక్ష్యమన్నారు. పనిచేసే ప్రదేశాలలో అధికశాతం ప్రమాదాలు అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్ల జరుగుతుంటాయని, వాటిని ముందుజాగ్రత్తతో నివారించేందుకు శ్రీసిటీ, పరిశ్రమలు కలసి తరచూ తమ ఉద్యోగులు, కార్మికులకు భద్రత పట్ల ఇలాంటి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా, శ్రీసిటీ ప్రాంతంలోని విద్యార్థులకు వ్యాసరచన, వ్యక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు శ్రీసిటీ మేనేజర్ (సేఫ్టీ) నరేంద్రబాబు తెలిపారు.

# 15న 'పెరసం' ఉగాది పురస్కారాలు

నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం(పెరసం) ఆధ్వర్యంలో ఈనెల 15న 'పరాభవ'నామ ఉగాది పురస్కారాల ప్రదానం జరుగనుంది. ఉగాది కవిసమ్మేళనంతో పాటు, కవయిత్రి తోట సులోచన సౌజన్యంతో ఆమె తల్లితండ్రులు తోట గురుమూర్తి-లక్షమ్మల స్మారక పురస్కారాలను ఈ సందర్భంగా పలువురు కవులు, సాహితీవేత్తలకు అందజేయనున్నారు. పురస్కారాలకు ఎంపికైన వారిలో షేక్ షంషుద్దీన్, ఇంద్రగంటి మధుసూదనరావు, దుప్పటి రమేష్‌బాబు, ముసునూరు నారాయణ, నందది అరుణ ఉన్నారని, వారికి పురస్కారాలను బహూకరించడంతో పాటు, కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులందరికీ జ్ఞాపికలు అందజేస్తామని కవయిత్రి తోట సులోచన తెలిపారు.

# 2.5 కోట్లతో.. ప్రసన్న వేంకటేశ్వరుని పుష్కరిణి

## ప్రారంభించిన.. విపిఆర్ దంపతులు



బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి పుష్కరిణి ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు ఈ నెల 1న పుష్కరిణికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ, గత ఏడాది ఆగస్టు 10న తాను శంకుస్థాపన చేసిన కోనేరును శరవేగంగా నిర్మించి స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రారంభోత్సవం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంపీ బీదా మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డిల కృషిని ఆయన అభినందించారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి కోనేరు పునఃనిర్మించే అవకాశం దక్కడం తమ పూర్వజన్మ సుకృతమన్నారు.

# 90 లక్షలతో.. అల్లూరులో సెంట్రల్ లైటింగ్



సెంట్రల్ లైటింగ్‌కి శంకుస్థాపన చేస్తున్న విపిఆర్, బీదా సోదరులు

అల్లూరు.. ఇక విద్యుద్దీపకాంతులతో శోభాయమానం కానుంది. ఆమేరకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో, ఓఎన్‌జీసీ కంపెనీ సిఎస్ఆర్ నిధులతో సుమారు 90 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటుకానున్న సెంట్రల్ లైటింగ్ పనులకు ఇటీవల శంకుస్థాపన, అదేవిధంగా, కావలి ఎమ్మెల్యే దీవీ కృష్ణారెడ్డి సొంతనిధులతో నిర్మించిన తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి ప్రారంభోత్సవం జరిగాయి. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ, అల్లూరు మండల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ అల్లూరు వాసిగా ఈ ప్రాంత అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానన్నారు. బీద రవిచంద్ర మాట్లాడుతూ, అల్లూరు అభివృద్ధి గతంలో కూడా తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే జరిగిందన్నారు. అల్లూరులో అభివృద్ధి కార్యక్రమాలకు 30 కోట్లు అవసరమని, ఇద్దరు ఎంపీలు దీనిపై దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# గూడూరు డివిజన్

## ముత్యాలమ్మ జాతరను రాష్ట్ర పండుగగా చేయాలి

**ఎమ్మెల్యే పాశిం సునీల్**



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

చిల్లకూరు మండలం, తూర్పుకనుపూరు గ్రామంలోని శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా చేయాలని ముఖ్యమంత్రిని కోరుతామని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ వెల్లడించారు. ఈ నెల 10వ తేదీ నుండి ముత్యాలమ్మ అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించేందుకు పాలక మండలి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల గూడూరులోని పార్టీ కార్యాలయంలో ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, పాలకమండలి ఛైర్మన్ చిల్లకూరు దశరథరామిరెడ్డి, ఈవో నవీన్‌కుమార్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముత్యాలమ్మ అమ్మవారి జాతర రాష్ట్రంలోనే ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని, ఈ నెల 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు జాతర వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, జాతరకు ప్రజలందరూ తరలిరావాలని కోరారు. కార్యాలయ సిబ్బంది సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జాతర ఏర్పాట్లపై సమీక్ష



సమీక్షా సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో అనూష

గూడూరు లోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఇంచార్జి ఆర్డీవో అనూష.. ముత్యాలమ్మ అమ్మవారి జాతర నేపథ్యంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను జయప్రదం చేయాలన్నారు. ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. డి.టి.సి డిఎస్పి గిరిధర్, డిఎల్‌డిఓ వాణిరెడ్డి, తహశీల్దార్ ఆర్.వి.ప్రసాద్, ఆలయ ఈవో కె.నవీన్‌కుమార్, ఛైర్మన్ చిల్లకూరు దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆహార విక్రయదారులకు అవగాహన



ఆహార విక్రయదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గూడూరు రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారమ్ వద్ద ఆహార విక్రయాలు చేసే వ్యక్తులకు గూడూరు పట్టణ, రెండో పట్టణ పోలీస్‌లు, జి.ఆర్.పి, ఆర్.పి.ఎఫ్ శాఖలు సంయుక్తంగా అవగాహన కల్పించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహార విక్రేతలు శుభ్రత పాటిస్తూ లైసెన్స్ నిబంధనలు తప్పనిసరిగా అనుసరించాలని పేర్కొన్నారు. పిల్లలు ఒంటరిగా తిరుగుతున్నా, మహిళలపై వేధింపులు గమనించినా వెంటనే తెలియజేయాలని, నిషేధిత వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గూడూరు పట్టణ సిఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, జి.ఆర్.పి, ఆర్.పి.ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీలపై దాడులు బాధాకరం



నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

విజయవాడలో శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ.. ఈ నెల 3వ తేదీ గూడూరు, పాత బస్టాండ్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట సి.ఐ.టి.యు నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సి.ఐ.టి.యు నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీలపై పోలీసులు ఒక్కసారిగా విరుచుకు పడి అరెస్టులు చేసి సుదూర ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్‌లకు తరలించడం దారుణమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే విధంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని వారు డిమాండ్ చేశారు. అంగన్‌వాడి అధ్యక్ష, కార్యదర్శులు ఏ.ఇంద్రావతి, బి.ఎస్.ప్రభావతి, జోగి శివకుమార్, సిఐటియు నాయకులు రమణయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

## భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

గూడూరు మండలం వెడిచర్ల గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా పశువుల మేతకు వాడుకుంటున్న భూమిని కొంతమంది రికార్డులను తారుమారు చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని గ్రామస్తులపై దౌర్జన్యం చేస్తున్నారని, అధికారులు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ నేషనల్ వైస్‌ప్రెసిడెంట్ సల్మాన్ రాజ్ కోరారు. గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఇటీవల నిరసన కార్యక్రమం నిర్వహించి, ఎమ్మార్వో ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ బాషా ఖాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్స్‌కి కౌన్సిలింగ్

గూడూరు పట్టణ పరిధిలోని ట్రాన్స్‌జెండర్స్‌ని ఇటీవల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కి పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. వివాహ కార్యక్రమాలు, షాపు ఓపెనింగ్స్ అప్పుడు కానీ, రోడ్లపై నడుచుకుని వెళ్లే ప్రజల వద్ద నుండి గాని డబ్బుల వసూళ్లకు పాల్పడకూడదని, అలా చేస్తే వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని చెప్పడం జరిగింది. వన్‌టౌన్ సిఐ, టూటౌన్ సిఐ, గూడూరు ఎస్సై, వన్‌టౌన్ ఎస్ఐ పాల్గొన్నారు.


## వి.ఆర్.ఏల సమస్యలను పరిష్కరించాలి

**-- సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.సుబ్బయ్య --**

వి.ఆర్.ఏల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని వి.ఆర్.ఏ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సుబ్బయ్య పేర్కొన్నారు. వి.ఆర్.ఏ.లకు పేస్కేలు వర్తింపజేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్‌ఏలుగా రెగ్యులర్ చేయాలంటూ, విఆర్‌ఏల సర్వీస్‌రూల్స్‌కు వ్యతిరేకంగా డ్యూటీలను రద్దు చేయాలన్నారు. ఈనెల 6న మంగళగిరి సిసిఎల్‌ఏ కార్యాలయం వద్ద సామూహిక రాయబారం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# కల్యాణ వైభవం...!

## సంహిత్ - జస్మిత




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, శ్రీవెన్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అధినేత నిడిముసిలి సురేష్‌కుమార్‌రెడ్డి - సరితల కుమారుడు **సంహిత్ - జస్మిత** (శ్రీకాళహస్తి వాస్తవ్యులు గండవరం రామచంద్రారెడ్డి - శ్రీవాణిల కుమార్తె)ల పరిణయం ఫిబ్రవరి 25వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.

## భార్గవ్ - విహసిత



నెల్లూరు వాస్తవ్యులు, హైదరాబాదు నివాసి చేరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి - స్వర్ణలతల కుమారుడు **భార్గవ్ - విహసిత** (హైదరాబాదు వాస్తవ్యులు గుండం వెంకటేశ్వరరెడ్డి - కళ్యాణిల కుమార్తె)ల వివాహం ఫిబ్రవరి 25వ తేదీ హైదరాబాదులో ఘనంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

## విష్ణు - హర్షిక



పిడూరు సాయిమోహన్‌రెడ్డిగా సుపరిచితుడైన మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి - సుప్రియల కుమారుడు **విష్ణు తేజ - సాయి హర్షిక** (వాకాడు మాంగుంట లక్ష్మీనారాయణరెడ్డి - రాజేశ్వరిల కుమార్తె)ల పెళ్లి ఫిబ్రవరి 26వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.

## నిషిత - లలిత్



నెల్లూరు వాస్తవ్యులు, యాష్ బాబుగా అందరికీ సుపరిచితుడైన మెడికల్ రెప్రజెంటేటివ్ సిద్ధు విజయమోహన్ - సంధ్యారాణిల కుమార్తె **నిషిత - వెంకట సాయి లలిత్‌కుమార్** (నెల్లూరు వాస్తవ్యులు కీ॥శే॥ యజ్ఞావర్ఘుల వెంకటేశ్వర్లు - శ్రీదేవిల కుమారుడు)ల కళ్యాణం ఫిబ్రవరి 21న నెల్లూరులో ఘనంగా జరిగింది. నవ దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## భావన - పృథ్వి



మేఘన ఆటోమొబైల్స్ అధినేత, ప్రముఖ వ్యాపారవేత్త గడ్డం రత్నయ్య - సుజాతల కుమార్తె **డాక్టర్ భావన - పృథ్విరాజ్** (విజయవాడ వాస్తవ్యులు అంబటి మురళీకుమార్ - సమతల కుమారుడు)ల వివాహం ఫిబ్రవరి 25వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రానికి.. నిధులివ్వాలి!

## • ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే సోమిరెడ్డి



నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలం సరస్వతీ నగర్‌లో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. ఈనెల 4న జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ సమస్యను ప్రస్తావించారు. 2011 సెప్టెంబరు 29వ తేదీన ప్రాచీన తెలుగు భాష విశిష్ట అధ్యయన కేంద్రం ప్రారంభానికి ఆర్థిక అనుమతులు ఇస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని, అయితే, అప్పటికే కొన్ని కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ 2018 నవంబరులో మైసూరులోని భారతీయ భాషా సంస్థలో తెలుగు భాష విశిష్ట ఆధ్యయన కేంద్రాన్ని పూర్తిస్థాయిలో ప్రారంభించిందని తెలిపారు. 2019లో అప్పటి ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చొరవతో నెల్లూరు జిల్లాలోని వెంకటాచలంకు ఈ కేంద్రాన్ని తీసుకువచ్చారని, అయితే.. ఆ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో స్వర్ణభారత్ ట్రస్టు భవనంలోనే తాత్కాలికంగా నిర్వహిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఈ భవన నిర్మాణాన్ని విస్మరించిందన్నారు. వెంకటాచలంలో 5 ఎకరాల భూమిని జాతీయ రహదారి పక్కనే ఈ కేంద్రం కోసం కేటాయించిందని, అయితే భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదన్నారు. ఈ కేంద్రానికి కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేయాలని, అలా కానిపక్షంలో రాష్ట్రప్రభుత్వమే ఆ భవన నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని ఆయన కోరారు.

# గృహనిర్మాణాలను పటిష్టం చేస్తాం

## • మంత్రి పార్థసారథి

ప్రభుత్వం పేదల కోసం చేపట్టిన గృహనిర్మాణాల విషయంలో గతంలో వైసీపీ హయాంలో అంతా అవకతవకలు జరిగాయని, అక్రమాలెన్నో చేశారని, ఇప్పుడు చివరికి ఏ ఇల్లు పనికొస్తుందో, ఏది పనికిరాదో కూడా తెలియని పరిస్థితి ఉందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీలో చెప్పడంతో, అందుకు గృహనిర్మాణ మంత్రి పార్థసారథి స్పందించారు. నెల్లూరు జిల్లాలో ఏ ఇళ్లు రిపేర్లకు పనికొస్తాయో గుర్తించామని, అలా చేయలేని వాటిని పూర్తిగా తొలగించి పాత కాంట్రాక్టర్లతో పునర్నిర్మాణం చేసేలా ఆదేశాలిచ్చామని తెలిపారు. ఇళ్ళ నిర్మాణాలకు ముందుకురాని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యేలకు ఇళ్ళ కోటా కేటాయించే విషయంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని కూడా ఆయన తెలిపారు.

# నిత్యాన్నదానానికి.. 50వేల విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న రాఘవేంద్రరావు, ప్రసన్నలక్ష్మి

జొన్నవాడ దేవాలయంలో జరుగుతున్న శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి శ్రీకాళహస్తి వాస్తవ్యులు మహంకాళి రాఘవేంద్రరావు–ప్రసన్నలక్ష్మి దంపతులు ఇటీవల 50వేల రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ఆలయ అర్చకులు దాతలకు దైవ దర్శనం చేయించి స్వామివార్ల ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

# ఐక్యతతో పనిచేయాలి

## బీసీ నేత కృష్ణయ్య



బీసీల సంక్షేమం కోసం బీసీలందరూ ఐక్యతతో పనిచేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య చెప్పారు. తిరుపతిలో ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవనిర్మాణ బీసీ సమాజ నిర్మాణం కోసం కార్యకర్తలను తయారు చేసే బాధ్యతతో ఆయా ప్రాంతాల్లోని బీసీ సంఘాల నాయకులు కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నెల్లూరు నగరానికి చెందిన షేక్ బాషాను నియమించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, నూకానమ్మ, శ్రీనివాస్‌యాదవ్, వి.వి.శేషయ్య, నెల్లూరు నగరానికి చెందిన పలువురు బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## టీ అంగట్లో..
# నారాయణ ముచ్చట్లు


టీ తాగుతూ స్థానికులతో ముచ్చటిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరులో ఇప్పుడు ఎక్కడ చూసినా మంత్రి నారాయణ టీ ముచ్చట్లే హాట్ టాపిక్‌గా మారాయి. ఎప్పుడూ అభివృద్ధి పనుల సమీక్షలు, పర్యటనలతో బిజీగా ఉండే మంత్రి, ఇటీవల సామాన్యునిలా నెల్లూరు నగరంలో పర్యటిస్తూ ఓ టీ అంగడి వద్ద టీ తాగుతూ, అక్కడున్న ప్రజలతో ముచ్చటించడం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. దుకాణదారుడి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ, "ఏమయ్యా..వ్యాపారాలు ఎలా ఉన్నాయి?..అంటూ ఆత్మీయంగా పలకరించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆయనతో పాటు వచ్చిన నాయకులు కూడా అదేవిధంగా టీ తాగుతూ, అందరితో హాయిగా మాట్లాడుతూ సందడి చేశారు.

## వందకోట్లతో..
# రూరల్‌లో అభివృద్ధి పనులు
### కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి


సిమెంటురోడ్డు పనులను పరిశీలిస్తున్న గిరిధర్‌రెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సారథ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 100 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరురూరల్ నియోజకవర్గ పరిధిలోని 27వ డివిజన్, చంద్రమౌళినగర్, 7వ వీధిలో 40 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేషన్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 27వ డివిజన్ అభివృద్ధికి కోటీ 80లక్షల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. చెప్పిన మాట ప్రకారం 60 రోజుల్లో 240 పనులు పూర్తిచేసి, మార్చి 3వ వారంలో ప్రజలచేతే వాటికి ప్రారంభోత్సవాలు చేయిస్తామని తెలిపారు.

# మహిళా మేలుకో!

ఓ మహిళా..మేలుకో!..
నీ లోగిలిలో నీడ..తమస్సు కానే కాదు
అది నీలోని భయం!
అది..నిన్ను బంధించిన కారాగారం!
అతివంటే కాదమ్మా..అబలత్వం
అది అణచిపెట్టిన అగ్నిపర్వతం
మౌనం వీడితే..నీవే ఒక గర్జన
సంకెళ్ళు తెంచుకుంటే..నీవే ఓ ప్రభంజనం
అందుకే మేలుకో!..
నీలో నీవే ధైర్యాన్ని పెంచుకో!..
ఆత్మవిశ్వాసమే..నీకు ఆయుధం
నిజాయితీయే..నీకు మూలధనం
ధైర్యే సాహసే లక్ష్మీ..అంటూ
ముందుకు..మున్ముందుకు సాగిపో!..
విజయ శిఖరాలు అందుకో!..
(మార్చి 8-అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా)...



**పార్లపల్లి నాగేశ్వరమ్మ**
ఫోన్ : 7386999490

# విద్యార్థుల భవితకు..విద్యే పునాది
### ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



మండల కేంద్రమైన వింజమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం ఇటీవల పెద్దసంఖ్యలో వచ్చిన విద్యార్థులతో కళకళలాడింది. వింజమూరు మండలంలోని అన్ని మండల పరిషత్ పాఠశాలల విద్యార్థుల కోసం వింజమూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యా, క్రీడా మరియు సాంస్కృతిక మహోత్సవం నిర్వహించారు. ఎంతో ఉత్సాహంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు పునాది విద్యేనన్నారు. అయితే క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు వారి వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడతాయన్నారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, ధైర్యం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని, సాంస్కృతిక కార్యక్రమాలు సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, భావ వ్యక్తీకరణ సామర్థ్యాన్ని పెంచుతాయని తెలిపారు. విద్యార్థులు ఆయా రంగాల్లో రాణించాలన్నారు. ఉత్తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకొని కష్టపడి చదివితే తప్పకుండా జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకుంటారని ఆయన తెలిపారు.

# రోబోటిక్స్‌పై..ఎన్‌బీకేఆర్‌లో శిక్షణ



శిక్షణా సదస్సులో మాట్లాడుతున్న ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఎలక్ట్రానిక్స్ మరియు రోబోటిక్స్‌పై కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 4వతేదీ నుంచి వారం రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ వారి సహకారంతో కళాశాలలోని తృతీయ సంవత్సరం బీటెక్, ఈసీఇ విద్యార్థులకు ఆమేరకు నైపుణ్యాభివృద్ధిలో మెళకువలు నేర్పుతున్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ రిసోర్స్ పర్సన్ కేపీ హర్షిణి ఆధ్వర్యంలో ఏఐ ఆధారిత సాంకేతికతలు, రోబోటిక్స్ అనువర్తనాలు, వినియోగం గురించి ప్రాక్టికల్ ఉదాహరణలతో ఆన్‌లైన్‌లో వివరిస్తున్నారు. ఇసిఇ విభాగాధిపతులు డా. కె నాగిరెడ్డి, ఎస్‌కె మహబూబ్ బాషాలు వాటి ప్రాధాన్యతను తెలియజేస్తూ, ప్రస్తుత సాంకేతిక రంగంలో ఏఐ కీలకపాత్రను పోషిస్తోందన్నారు. విద్యార్థులు ఈ రంగంలో నైపుణ్యం సాధించడం అత్యవసరమని, అది అనివార్యమని కూడా వారు తెలిపారు. కళాశాల సంచాలకులు డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, పరిశ్రమల అవసరాలు, సాంకేతికరంగ అవసరాలకు ఈ శిక్షణ అవసరమని, ఇది విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఏఐ, రోబోటిక్స్ వంటివి నేర్చుకునేందుకు విద్యార్థులు ఆసక్తితో ఉండాలని, అది వారిలో ఆత్మవిశ్వాసం పెంచుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. సమన్వయకర్త డా.ఆర్.లావణ్య, అకడమిక్ డీన్ డా.జి.హమీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చి-సంగం పాలకేంద్రాల్లో తనిఖీలు

రాజమహేంద్రవరంలో ఇటీవల పాలకేంద్రాల నిర్వాహకులు పాల పంపిణీలో అవకతవకలకు పాల్పడి పలువురి మరణాలకు కారణమైన నేపథ్యంలో ఆహార భద్రతా అధికారులు పాలకేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. ఇటీవల జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, సంగం మండలాల పరిధిలోని పలు పాలసేకరణ కేంద్రాలు, కోవా తయారీ కేంద్రాలపై తనిఖీలు నిర్వహించారు. కొందరు అత్యాశపరులు పాలలో కొవ్వు శాతం (ఫ్యాట్) అధికంగా చూపేందుకు, పాలు చిక్కగా ఉన్నట్లు కనిపించేందుకు పాలలో ఇతర పదార్థాలను కలిపి, ఆ కల్తీపాలను ప్రజలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, ఒకవేళ అలాంటి అక్రమాలకు పాల్పడేవారి సమాచారాన్ని తమకు తెలియజేస్తే, ఆ కల్తీవ్యాపారులపై తగు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. తమకు సమాచారం అందించినవారి వివరాలను ఎట్టిపరిస్థితుల్లోనూ బయటపెట్టేది ఉండదని, నిర్భయంగా ఫిర్యాదులు పంపవచ్చని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదులను తమకు నేరుగా అందజేయదలచిన వారు నెల్లూరు వేదాయపాళెం వద్దనున్న చంద్రమౌళి నగర్-5వ లైన్‌లోని తమ కార్యాలయంలో ఇవ్వవచ్చని వారు తెలిపారు.

# అర్హులందరికీ..ప్రభుత్వ పథకాలు

సామాజిక భద్రతే ధ్యేయంగా ప్రభుత్వం అర్హులందరికీ ఎన్నో పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తోందని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల చెప్పారు. ఇటీవల గూడూరు, మాలవ్యానగర్‌లో ఆయన ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లను స్వయంగా లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట గూడూరు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, పురపాలకశాఖ అధికారులు పాల్గొన్నారు.

## టూకీగా...



### వింజమూరులో అంగన్‌వాడీల మానవహారం

విజయవాడలో అంగన్‌వాడీల అక్రమ అరెస్టులకు నిరసనగా వింజమూరులో సీఐటీయు ఆధ్వర్యంలో ఈనెల 3న మానవహారం నిర్వహించారు. అంగన్‌వాడీ నాయకుల అరెస్టులు అక్రమమని ఈ ఆందోళనలో పాల్గొన్న సీఐటీయు నాయకుడు భాస్కర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వం మొండివైఖరి విడనాడి అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

### కోవూరులో ఉచిత కంటిపరీక్షలు

మండల కేంద్రమైన కోవూరులో వాసన్ ఐ కేర్ ఆసుపత్రి వారు ఈనెల 3న స్థానిక ప్రజలకు ఉచిత కంటిపరీక్షలు నిర్వహించారు. వీరాంజనేయస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 75 మందికి వైద్యులు ఉచిత కంటిపరీక్షలు చేసి, కంటివ్యాధుల పట్ల అవగాహన కలిగించారు.

### బోగోలులో ఇళ్ళ పన్నులపై సమావేశం

బోగోలు మండలంలోని పంచాయతీల్లో ఇళ్ళపన్నుల వసూలు విషయమై ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ పంచాయతీల్లో సుమారు 43 లక్షల దాకా బకాయిలున్నాయని, ఈనెల 31వ తేదీలోగా పన్నులు వసూలు చేయాలని పంచాయతీల అధికారులకు, సచివాలయాల సిబ్బందికి స్పష్టం చేశారు.

### ఉదయగిరిలో హెల్మెట్ ధారణపై అవగాహన

ఉదయగిరి జాతీయ రహదారిపై ఈనెల 3న ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కలిగించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్‌లు రక్షణ కవచంగా పనిచేస్తాయని, హైవేపై ప్రయాణించేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

### ఆత్మకూరులో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరులోని గురుకుల పాఠశాలలో ఈనెల 3న విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఆత్మకూరు సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు అంతర్జాతీయ మహిళాదినోత్సవం రోజు.. మార్చి 8న బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.

### మాదన్నగారిపల్లిలో గొర్రెలపై కుక్కల దాడి

కలువాయి మండలం మాదన్నగారిపల్లిలోని గిరిజన కాలనీలో ఉన్న గొర్రెలదొడ్డిపై ఈనెల 2వ తేదీ రాత్రి కుక్కలు దాడిచేయడంతో, ఏడు గొర్రెలు మృతిచెందాయి. దీంతో గొర్రెల యజమాని లబోదిబోమంటూ పంచాయతీ అధికారులకు తమ గోడు వినిపించాడు. కుక్కల బారి నుంచి గొర్రెలను రక్షించే ఏర్పాట్లు చేయాలని కోరాడు.

### సీతారామపురంలో విద్యుత్‌తీగల చోరీ

సీతారామపురంలోని కోటవీధి సమీపంలో ఉన్న గుంటమడుగు వాగులో ఏర్పాటుచేసిన మినీ తాగునీటి పథకం బోరుకు ఉన్న సుమారు 50 మీటర్ల విద్యుత్‌తీగలను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. దీంతో తాగునీటి సరఫరాకి ఇబ్బందులు కలుగుతున్నాయంటూ గ్రామస్థులు పంచాయతీ అధికారులకు తెలపడంతో, వారు కొత్త వైర్లను అమర్చారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సంగం మండలంలోని దువ్వూరులో ఈనెల 3న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచనలతో, పీఏసీఎస్ ఛైర్మన్ హరిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కేంద్రం ప్రారంభమైంది. సొసైటీ డైరెక్టర్లు, కార్యదర్శి తదితరులు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

### కొడవలూరులో జనాభా లెక్కలపై సదస్సు

మండల కేంద్రమైన కొడవలూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 4న జనాభా లెక్కలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటసుబ్బారావు పాల్గొని జనాభా గణనపై సిబ్బందికి, అధికారులకు తగు సూచనలిచ్చారు. డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, డిప్యూటీ ఎంపీడీఓ శ్యామసుందర్, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.







# నెల్లూరు నేతలకి.. లోకేష్ ఆత్మీయ విందు!

మార్చి 3వ తేదీ ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో నెల్లూరు జిల్లా నేతలని, వారి కుటుంబాలని చంద్రబాబు రాజకీయ వారసుడు ఐటీ మరియి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆత్మీయంగా కలుసుకున్నారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించిన నేతలని వారి వారి కుటుంబసభ్యులని లోకేష్ వరుసగా కలుసుకుంటున్నారు. అందరికీ ఆత్మీయ విందు ఇస్తున్నారు. అదే పరంపరలో భాగంగా మంగళ వారం నాడు నెల్లూరుజిల్లా నేతలని కూడా ఆహ్వానించి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మునిసిపల్ మంత్రి పొంగూరు నారాయణ, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర, నెల్లూరురూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, శాసన మండలి సభ్యులు బల్లి కళ్యాణ్, గూడూరు శాసనసభ్యులు పాశిం సునీల్ కుమార్, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్, కావలి శాసనసభ్యులు దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డిలు తమ కుటుంబసభ్యులతో పాల్గొన్నారు. ఈ ఆత్మీయ విందుకి వచ్చిన ప్రతిఒక్కరినీ పేరుపేరునా పలకరించిన లోకేష్, నేతల కుటుంబ సభ్యుల పేర్లు, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జిల్లాలో వున్నప్పుడు ఇలా ఒకేసారి ఒకే చోట కలుసుకునే అవకాశం మన నేతలకి రాదు. లోకేష్‌బాబు పుణ్యమా అంటూ అందరూ ఒకే గూట్లో కలుసుకోవడం విశేషమేగా మరి!















## అత్యాధునిక వసతులతో, ఆహ్లాదకర ప్రాంగణంలో...

## ప్రపంచస్థాయి నివాసాలతో అందుబాటులోకి వచ్చిన

# గ్రీన్ హోమ్స్ వారి 'సెంట్రల్ వరల్డ్'

పెరుగుతున్న జనాభాకి అనుగుణంగా నెల్లూరు నగరం కూడా శరవేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా కనుపర్తిపాడు – గొలగమూడి ప్రాంతాలలో అధునాతన నెల్లూరు పురుడు పోసుకుంటోంది. నాలుగులైన్ల జాతీయ రహదారిపైన వంతెన నిర్మాణం జరుగుతుండడంతో గొలగమూడి వైపు అత్యాధునిక వసతులతో నివాస సముదాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. పర్యావరణ కాలుష్యానికి దూరంగా, ఆరోగ్యకరమైన ఆహ్లాద వాతావరణానికి దగ్గరగా, ఆనందమయ జీవితాన్ని ఆస్వాదించడానికి ఆధునిక సమాజం ఆసక్తి చూపుతోంది. ప్రజల ఆకాంక్షలకి అనుగుణంగా కొత్త నివాస ప్రాంగణాలు ముస్తాబవుతున్నాయి. వాటితో పాటు విశాలమైన ప్లాట్లతో లేఅవుట్లు కూడా రూపుదిద్దుకుంటున్నాయి. సొంత ఇల్లు కావాలనుకునే వారి అభిరుచులకు తగ్గట్లుగా అనేక విల్లా ప్రాజెక్టులు కూడా అందుబాటులోకి వస్తున్నాయి.

### నెల్లూరుకి విస్తరించిన 'గ్రీన్ హోమ్స్'

గత 27 సంవత్సరాలుగా హైదరాబాదు, బెంగళూరు, చెన్నై వంటి మహా నగరాలలో తమ వెంచర్ల ద్వారా పెట్టుబడిదారుల విశేష ఆదరణ పొందిన గ్రీన్ హోమ్స్ యాజమాన్యం ఇప్పుడు తమ జన్మభూమి నెల్లూరులో సైతం మహానగరాల తరహా జీవన వసతి కల్పించడానికి అంకురార్పణ చేసింది. తొలి విడతగా కాకుటూరు సమీపంలోని ఈనాడు ఎడిషన్ కార్యాలయం ఎదురుగా 60ఎకరాలలో "వన్ వరల్డ్" పేరుతో గేటెడ్ కమ్యూనిటీని పెట్టుబడిదారులకి అందించి నెల్లూరీయుల విశ్వాసాన్ని, నమ్మకాన్ని సొంతం చేసుకుంది. అదే ప్రాంగణంలో 30విల్లాలని కూడా నిర్మించి గృహ యజమానులకి అందించింది. ఇప్పటికే కొన్ని కుటుంబాలు "వన్ వరల్డ్"లో నివాసం కూడా ఉంటున్నాయి.

ఇదే స్ఫూర్తితో ఇప్పుడు గొలగమూడి రోడ్డులోని వీపిఆర్ స్కూలుకి సమీపంలో 'గ్రీన్ హోమ్స్' వారి 'సెంట్రల్ వరల్డ్' ఆవిష్కరించబడింది. 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు ప్రారంభించబడింది. ఈ



నిర్మాణంలో ఉన్న విల్లాల నమూన

లేఅవుట్లో మొత్తం 300 ఇళ్ల ప్లాట్లు వున్నాయి. వాటిలో 30ప్లాట్లని ఎంపికచేసి ఆకర్షణీయమైన ఆధునిక వసతులతో విల్లాలని కూడా నిర్మిస్తున్నారు. సుమారు 3600 చదరపు అడుగులు వుండే విధంగా ఒక్కొక్క విల్లాని డిజైన్ చేశారు. సెంట్రల్ వరల్డ్ కమ్యూనిటీలో నివసించే వారి కోసం 30వేల చదరపు అడుగులలో క్లబ్‌హౌస్‌ని నిర్మిస్తున్నారు. ఈ క్లబ్‌హౌస్‌లో ఫంక్షన్ హాల్, జిమ్, గెస్ట్ రూములు, స్విమ్మింగ్‌పూల్, ఇండోర్ గేమ్స్ వంటివి కల్పిస్తున్నారు. లేఅవుట్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించడంతో పాటు, పూర్తిస్థాయిలో 40, 50, 60అడుగుల సిమెంట్‌రోడ్లతో లేఅవుట్‌ని రూపొం దించారు. "రెరా" (RERA) నిబంధనల్ని పాటిస్తూ, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ నియమాలని అమలు చేస్తూ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ "సెంట్రల్ వరల్డ్"ని నెల్లూరీయు లకి అందించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థతో పాటు మునిసిపల్ కనెక్షన్ల ద్వారా మంచినీటి వసతి కూడా కల్పించారు. నెల్లూరుకి అతి సమీపంలో నగరానికి అనుబంధంగా అభివృద్ధి చెందుతున్న గొలగ మూడి ప్రాంతంలో రూపొందించబడిన ఈ లేఅవుట్ పట్ల ఆహ్లాదకర వాతావరణంలో సొంత ఇల్లు కావా లనుకునే వారితోపాటు పెట్టుబడిదారులు కూడా ఆక ర్షితులవుతున్నారు. నెల్లూరీయులు తమని విశేషంగా ఆదరిస్తున్నారని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో ఇంకా అద్భుతమైన ప్రాజెక్టులు అందిస్తామని "గ్రీన్ హోమ్స్" సంస్థ సారధులు బొల్లినేని హజరత్‌రావు, బొల్లినేని హరిబాబు, బేతిరెడ్డి సాయిరాం, జ్ఞానశేఖర్ తెలిపారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com